GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026

## మధుర స్మృతులు





ఆశ్రమంలో అభయాంజనేయ స్వామి





ఆవిష్కరణ మహోత్సవం (జూన్ 2011)




Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.
IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043


# గిరిధారి


జూలై 2025
శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు







ఆశ్రమంలో యతి పంచకముపై ప్రవచనములు (జనవరి 2011)
















## ప్రార్థన



శ్లో॥ సంసార సాగర సముద్ధరణైక మంత్రం
బ్రహ్మాది దేవ ముని పూజిత సిద్ధమంత్రం ।
దారిద్ర్య దుఃఖ భవరోగ వినాశ మంత్రం
వందే మహాభయహరం గురురాజ మంత్రమ్ ॥

భవ సాగరము నుండి చక్కగా ఉద్ధరించుటలో ముఖ్యమైన మంత్రము, బ్రహ్మాది దేవతల చేత, మహర్షుల చేత పూజింపబడి, వారికి సమస్త సిద్ధులను అనుగ్రహించిన మంత్రము, దారిద్ర్య దుఃఖమును, సంసార రోగమును నశింపచేయు మంత్రము, గొప్ప భయమును పోగొట్టునది అయిన 'గురుః' అనెడి మంత్ర రాజమునకు ప్రణామము.



పండుగలు

**10-7-2025** - గురుపూర్ణిమ

# గీతాధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 40 సంచిక : 8

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో



జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com ( email : admin@sundarachaitanyam.org )




## ఆప్తవాక్యం

### ప్రార్థనే ప్రగతికి మార్గం

**అద్యాపి రత్నాకర ఏవ సింధుః**

సముద్రము నేటికీ రత్నాకరమే. నిజమే. సాగరము ఎప్పటికీ రత్నగర్భయే. ఆ మాట వినగానే సంతోషంగా ఉంటుంది. ఆహ్లాదంగా ఉంటుంది.



**అనిత్య మసుఖం లోకం**

ప్రపంచము స్థిరము కానిది. సుఖము లేనిది. అవును. ఈ లోకము అలాగే ఉంది. దుఃఖాలయంగా తెలుస్తూ ఉంది. ఈ విషయం చెవిలో పడినా, మనస్సులో కదలినా ఏదో శూన్యం హృదయంలో తాండవిస్తుంది.

ఈ ఆవేదన ఈనాటిది కాదు. ఏ ఒక్కరిదో కాదు. అందరికీ ఉంది. అందరిలో ఉంది.

హే మహర్షీ! సముద్రాలు ఎండి పోతున్నాయి (**శోషణం మహార్ణవానాం**). పర్వతాలు కూలి పోతున్నాయి (**శిఖరిణాం ప్రపతనం**). పెద్ద పెద్ద వృక్షాలు నిలబడలేక పోతున్నాయి (**అస్థానం వా తరూణాం**). భూమి కరిగి పోతోంది (**నిమజ్జనం పృథివ్యాః**). ఇలాంటి ప్రపంచంలో దేనిని ఆశించాలి? ఆశించి ఏమి సాధించాలి? భగవాన్! మహాత్మా! మీరే దారి చూపాలి. మీరే మాకు దిక్కు (**భగవన్! త్వం నోగతి స్త్వం నో గతి రితి**) అంటూ, బృహద్రథుడు అనే రాజు శాకాయన్య డనే ఋషిని ఉపనిషత్తులో ప్రశ్నించాడు.

ఆనాడే కాదు, నేడు కూడా ఈ ప్రపంచంలో అవే ప్రశ్నలు, అదే ఆవేదన. కాలం మారుతోంది. కలకలం అలాగే ఉంది. ప్రపంచం దుర్భేద్యంగా ఉంది. బ్రతుకు దుర్భరంగా సాగుతోంది. అన్నీ భయాలే. అందరిలో బాధలే.

విశ్వంలో పరిశోధనలు సాగుతున్నాయి. అణువణువులో శాస్త్రజ్ఞులు అదే పనిగా అన్వేషిస్తున్నారు. లభించేవి లభిస్తూ ఉన్నాయి. ఆశించింది మాత్రం అందడం లేదు. ఈ విషయంలో పరాజయానిదే పరాకాష్ఠ.

మన అన్వేషణ లోనే ఏదో అపశ్రుతి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచం మనకు బాహ్యంలో ఉంది అని భావించి అన్వేషణ ఆరంభిస్తున్నాం. మనకు వాస్తవంగా అది బాహ్యంలో ఉంటే, అది మన జ్ఞానంలో ఎప్పటికీ ఇమడదు. మన జ్ఞానంలో ఇమడనిది మనకు ఎప్పుడూ అర్థం కాదు.

నేను ఉన్నాను **(అహమస్మి)**. ఈ ప్రపంచమూ ఉంది **(ఇదం జగత్ అస్తి)**. ఇవి రెండు సత్యాలని భావించి మన ఆలోచనల్ని కదలిస్తూ ఉన్నాం. ఇంతకీ, ఈ రెండూ సత్యాలేనా? ప్రపంచము, మనమూ రెండూ సత్యమైతే, మనం వెతికేది ఏ సత్యం కోసం? ప్రపంచం కోసమైతే, మనల్ని మనం పోగొట్టు కుంటాం. మన కోసమైతే, ప్రపంచం మన నుండి జారి పోతుంది. సత్యాలు రెండు ఉంటే మాత్రం ఈ దురవస్థ తప్పదు. ఇక్కడే ద్వైతాన్ని జీర్ణించుకోలేక పోతున్నాము. ద్వైతము జీర్ణించుకో దగినది కాదు అని కూడా తెలుస్తోంది. అందుకే ద్వైతము భక్ష్యము కాదు అన్నది ఉపనిషత్తు **(అభక్ష్యం ద్వైత భావనమ్)**.

## ప్రపంచం ఏమిటి?

ఈ ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. కాని, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాం. ఎందుకో తెలుసా? ఈ జగత్తుకు మనం యజమానులం కాదు. ఇది మనం తయారు చేసిన ప్రపంచం కాదు. ఇది మన సొత్తు కాదు. మనకు సొంతమూ కాదు.

భౌగోళికంగా ఈ ప్రపంచం చాలా పెద్దది. ఎంత గానో విస్తరించి ఉంది. అంతరిక్షం విషయం ఇక చెప్ప నవసరం లేదు. అనూహ్యంగా ఉంది. ఈ మహా విశ్వంలో మనిషిగా నే నేమిటి? తలలు బాదుకున్నా తీరము తెలియడం లేదు.

మారే వాటిని ఆపలేము. మారని వాటిని మార్చలేము. ఏది ఎందుకు జరుగుతుందో చెప్పలేము. మరు క్షణంలో ఏం జరుగుతుందో ఊహకు అందదు. ఎవరు కలుస్తారో తెలియదు. ఎవరు విడిపోతారో అర్థం కాదు. ఇదే మనం చూస్తున్న ప్రపంచం. అందుకే ఇది లోకమైంది **(లోక్యతే ఇతి లోకః, అనుభూయతే ఇతి)**.

## నే నేమిటి?

దేశంలో ఉన్నామే గాని దేశం అర్థం కాదు అని తేలిపోయింది. పోనీ, దేహంలో ఉన్నాను కదా, ఈ దేహ మైనా అర్థ మౌతుందా? అదీ లేదు. దేహం మనము అని భావిస్తున్నాం. దేహాన్ని మనం నియమించ లేము. తన దారిన తాను పోతుందే తప్ప, మనం ఉండ మన్నట్లు ఉండదు. మన దేహ మైతే, మనం చెప్పినట్లు ఎందుకు వినదు? వద్దని వారిస్తున్నా రోగా లెందుకు వస్తున్నాయి? దంతాలు ఎందుకు ఊడు తున్నాయి? కేశాలు ఎందుకు తెల్లబడుతున్నాయి? అందాల హంగులు ఎందుకు క్షీణిస్తున్నాయి?



ఇవన్నీ చూస్తూ ఉంటే ఏమనిపిస్తుంది? మన మీద మనకు ఆధిపత్యం లేదని తేలుతుంది. ఈ దేహం మనం కాదు. దేహం విషయంలో మన మాట సాగదు అనడానికి తిరుగు లేని వాదము ఒక్కటే. చావు. మరణం.

మరణించడం ఎవ్వరికీ ఇష్టం లేదు. మరణించకుండా ఎవ్వరూ ఉండలేరు. మరణ నిర్వాకాన్ని సాగించే శక్తి ఏదో ఉంది. ఆ ఉన్నది కూడా మన లోనే ఉంది. జీవనానికి అదే కారణం. మరణానికి కూడా అదే కారణం. మనుగడ దాని తోనే. మరణం దాని తోనే.

## రెండులో ఉన్న దొక్కటే

మనిషిలో ఉన్నదే మహిలో ఉంది. మనిషి మనుగడకు ఆధార మైనదే మహికి అధిష్ఠానంగా ఉంది. అదే మహిమ. ఈశ్వర మహిమ. పరమేశ్వర మహిమ. కనుక మహిమ అర్థమైతే, ప్రపంచ మేమిటో అంతా తెలిసి పోతుంది.

**యస్మిన్ విజ్ఞాతే సర్వ మిదం విజ్ఞాతం భవతి**

ఆ మహిమను తెలుసుకుంటే, ఈ సమస్త ప్రపంచము తెలిసిందే అవుతుంది అన్నది ఉపనిషత్తు.

అలాగే మహిమ అర్థమైతే, మనిషి ఏమిటో కూడా తెలిసి పోతుంది. నీవే మహిమ అయినపుడు, మహిమను బోధించుటకు మరొకరు అవసరమా? నీవే గురువుగా కూడా తేజోమయుడవు.

**త్వమేవ పరమాత్మాసి త్వమేవ పరమో గురుః**

నీవే పరమాత్మవు. నీవే పరమ గురుడవు అన్నది తేజో బిందూపనిషత్తు.

## ఎద ఎదగాలి

మహిమాన్విత మైనది మహిమ ఒక్కటే. అది మార్పు చెందదు. నశించదు. కనుక మంగళకర మైనది. అందుకే అది సత్యం. శివం. కనుక సుందరం. అదే చైతన్యం. సర్వగతం. ఏకం. అద్వితీయం.

అందుకనే అది వ్యక్తిలో ఉంది. విశ్వం లోనూ ఉంది. దానికి హద్దులు నిర్ణయించ లేము. అది ఇక్కడ ఉంది, అక్కడ లేదు అని చెప్పలేము. ఒకవేళ చెబితే, అలా చెప్పడానికి ఆధారము ఎవరు? అని ఆలోచిస్తే, మళ్ళీ అది చైతన్యమే అయి ఉంటుంది.

ఒకవేళ నీ చైతన్యము - నా చైతన్యము అని చైతన్యానికి రెండు ద్వారాలు తెరిస్తే, ఇలా కల్పించుకొనిన రెండు చైతన్య విశేషాలను కలిపేది ఒకటి ఉండాలి కదా! ఈ రెండిటి మధ్య దూరం ఉందా? ఉంటే, ఆ మధ్య దూరాన్ని తెలుసుకొనే దెవరు? తెలుసుకొనేది ఏదో అది అక్కడ లేకుండానే తెలుసుకుంటుందా? ఉండి తెలుసుకుంటుందా? ఉండే తెలుసుకోవాలి. మధ్యలో తెలిసిన దూర మేమిటో ఇప్పుడు ఆలోచించండి. అది కూడా చైతన్యమే.

ఇదిగా తెలిసింది చైతన్యమే. అదిగా తెలిసేది చైతన్యమే. అర్థం గాక, రెండు చైతన్యాలు ఉన్నవని ఒకవేళ భావిస్తే, ఆ రెండిటి మధ్య దూరం కూడా చైతన్యమే. చైతన్యంలో దూరాలు లేవు. ఎందుకని? చైతన్యము అభేదము కనుక. అలాగే, చైతన్యంలో కాలాలు లేవు. ఎందుకని? చైతన్యము నిత్యము కనుక.

ఇక బాహ్య మేమిటి? ఆంతర్యం ఎక్కడ? ఒకవేళ ఉన్నా, అదీ చైతన్యం గానే ఉంది గాని, దేశ కాలాదులుగా లేదు. **(యచ్చ కించిత్ జగత్ సర్వం దృశ్యతే శ్రూయతే పివా అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః).**

ఇదీ వాస్తవం. మరి, అది - ఇది ఏమిటి? అక్కడ - ఇక్కడ అనేవి ఎక్కడ ఉన్నాయి? విశ్వం వ్యక్తి కన్నా వేరుగా ఉండట మేమిటి?

ప్రశ్న లైతే బాగానే ఉన్నాయి. కాని, వ్యవహారంలో తెలిసే దంతా భేదమే కదా? అవును. అందులో సందేహం లేదు. ఉన్న ఒకటి రెండుగా, అసంఖ్యాకంగా తెలుస్తూ ఉంది అంటే, ఎక్కడో దోషం ఉంది. ఆ దోషం దృష్టిదే గాని, సృష్టిది కాదు. దృష్టి దోషం వల్ల సృష్టి భిన్నంగా తెలుస్తూ ఉంది. దృష్టి సరిపడితే సృష్టి ఎవరో కాదు; సృష్టికర్తే. ఈశ్వరుడే. పరమేశ్వరుడే.

ఈ భేదాన్ని నివారించుకోవాలి. ఈ దశలో అది మనకు సాధ్యపడేలా లేదు. మనము సాధించ లేని దానిని మరొకరి సహాయంతో సాధించుకోవాలి. ఆ సహాయం చేసేవాడు కూడా మన లాంటి వాడే అయితే? ఆ తరువాత, సహాయము అనే పదానికి అర్థ మేమిటో వెతుక్కోవలసి వస్తుంది.

**శివుడే శరణ్యం**

మనం సాధించ లేనిది, అన్యులు సహకరించినా సాధ్యం కానిది ఉన్నది అని తెలియ గానే, ఆ మరుక్షణం ఎక్కడ నుండి సహాయం అందుతుందో ఆ వైపుకు మనస్సు దిక్కుచిలా తిరిగి పోతుంది. అదే ఈశ్వర ధామం. పరమేశ్వర నిలయం.

కనికరించ మని కైలాసపతిని పిలవాలి. అనుగ్రహించ మని ఆదిదేవుని అభ్యర్థించాలి. ప్రార్థించాలి. స్తుతించాలి.

ఉన్నవాళ్ళే అయినా, పిలిస్తే గాని రారు. ఈశ్వరుడు ఉన్నవాడే అయినా పిలిస్తేనే పలుకుతాడు. పిలిచే సంస్కారాన్ని మనస్సుకు పట్టించాలి. ప్రార్థించే శుభ సంస్కారం బుద్ధికి పట్టాలి. అలా పట్టాలి అంటే, ప్రార్థిస్తూ ఉండటమే మార్గం. స్తుతిస్తూ ఉండటమే గమనం.


ఓం స్వామి సుందర చైతన్యానంద



# వినిపించలేదా కోనేటి దేవా!

(చైతన్య గానం - 10)

శ్రీమతి సి.పద్మ



పల్లవి: వినిపించలేదా కోనేటి దేవా
కన్నీటి నా గాథ ॥ విని ॥

అనుపల్లవి: అడుగు అడుగుకు కొండల స్వామి
దండము గైకొనవా! ॥ విని ॥

చరణములు:

1. పలుకుచుంటిని పాడుచుంటిని
పలుకరింతువని
పలుకుబడిగల బంగారు గుడిలో
పలుకే బంగారమా! ॥ విని ॥

2. చెప్పుచుంటిని కథలను తియ్యగా
కనికరింతువని
నామాల మాటున చూపును దాచితే
ఎవరితో మొరలిడుదూ? ॥ విని ॥

3. దిక్కులు తిరుగుచు చిక్కులు పడితి
చిక్కెదవని నీవు
పరితపించుచు ప్రక్కన జేరితి
పరిహసించకయ్యా! ॥ విని ॥

4. ఆడాడ తిరిగి అలసిపోయాను
ఆదుకో స్వామీ!
తిరుగుడు తలతిరుగుడు మాని
నీ గుడి తిరిగెదను ॥ విని ॥

పగలు రేయి, వెలుగు చీకటి పరస్పరం విరుద్ధమైనవి. వైరుధ్యం గల ఈ రెంటికీ ఏకమైన ఆదిత్యుడే ఆధారం. పగలున్నప్పుడు రేయి లేదు. వెలుగు ఉన్న దగ్గర చీకటి లేదు. అయినా, పగటిని రేయి, వెలుగును చీకటి అంటిపెట్టుకొనే ఉంటాయి. ఒకదానిని ఒకటి అనుసరిస్తూనే ఉంటాయి.

వెలుగునీడల కలయికే జగత్తు. కష్టసుఖాల మిశ్రమమే జీవితం. సూర్యుడి కిరణాలు నిరాటంకంగా సాగడం ఎండైతే, కిరణప్రసారంలో అంతరాయం కలగడమే నీడ. అనుకున్నవి అనుకున్నట్లు జరగడం సుఖమైతే, అనుకున్నవి అనుకున్నట్లు జరగకపోవడమే దుఃఖం. పగలు సూర్యుడి వెలుగును అనుభవిస్తూ రాత్రి సూర్యోదయానికై ఎదురు చూస్తుంది జగత్తు. సుఖంలో భగవంతుడి ప్రేమలో ఓలలాడుతూ కష్టాలలో భగవంతుడి దయకై నిరీక్షిస్తాడు భక్తుడు.

భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులు, దేహం ప్రాణం, మనస్సు బుద్ధి, సుఖము దుఃఖము, జ్ఞానము అజ్ఞానము - ఇవన్నీ కలిస్తేనే జీవితం. నావిగా తెలిసేవన్నీ నాకన్నా వేరైనవే. నా ఇల్లు, నా భార్య, నా దేహం, నా ప్రాణం నాకన్నా వేరైనట్లుగా, నా జీవితం, అది పంచే సుఖ దుఃఖాలు కూడా నాకన్నా వేరైనవే. ఇది తెలిస్తే శాంతి. ఇది తెలియకపోవడమే భ్రాంతి. అదే జగత్సత్యత్వ భ్రాంతి.

నేను ఉన్నాను అనేది నా అనుభవం లోనే ఉంది. కానీ నేను సత్యంగా ఉన్నాను అనే జ్ఞానం గురుబోధ లోనే అందాలి. నేనే సత్యం అనే జ్ఞానం ఎప్పుడైతే కలుగుతుందో సత్యం ఏకమే కనుక నాకన్నా అన్యంగా తెలిసే ఈ జగత్తు సత్యం కాదు అనే నిజం ఎరుక పడుతుంది. జగత్తే ఎప్పుడైతే సత్యం కాదో, జగత్తు పంచే సుఖదుఃఖాలు నీటి మీద రాతలే ననే విషయం తేలిపోతుంది.

సుఖం మనిషి స్వరూపం కనుక సుఖాలలో ఎటువంటి ఘర్షణ లేక సహజంగా సునాయాసంగా కాలం దొర్లిపోతుంది. ఘర్షణలు, ఫిర్యాదులు అన్నీ కష్టాల లోనే. కష్టాలు కర్మఫలాలు. దుఃఖం మనోజనితం. భగవంతుడు కర్మ ఫలాలను మాత్రమే ఇస్తున్నాడు. కష్టాలను ఇవ్వడం లేదు. కష్టాలు నష్టాలు అనేవి సన్నివేశాలు మాత్రమే. సన్నివేశాల వల్ల, పరిస్థితుల వల్ల మనలో పుట్టే ప్రతిచర్యలే సుఖదుఃఖాలకు కారణం.

ఒకే కుటుంబంలో సంభవించిన ఆపదలు, కష్టాలు కుటుంబంలోని వారందరినీ ఒకే విధంగా కలతపెట్టడం లేదు. బాధలొస్తే ఆహారం సహించనివారు కొందరు. నిద్రకు దూరమయ్యేవారు కొందరు. నవ్వును కోల్పోయేవారు కొందరు. కన్నీళ్ళలో కుమిలిపోయే వారు కొందరు. అనారోగ్యంతో మంచం పట్టేవారు కొందరు. కన్నీళ్ళను దిగమింగుతూ చేయ వలసిన కార్యాన్ని చేపట్టేవారు కొందరు. ఇదంతా వ్యక్తిగతంగా వారివారి మనోస్థితిపైన హృదయ పరిపక్వత పైన ఆధారపడి ఉంటుంది. కానీ, ఎన్ని కష్టాలు వచ్చినా సమత్వాన్ని కలిగి ఉంటూ పరమాత్మ అదృశ్యహస్తాన్ని దర్శించే స్ఫూర్తి, శక్తి ఒక్క భక్తుడికే ఉంటుంది.

దారిలో పడి ఉన్న రాళ్ళు, ముళ్ళు వాటంతట అవి వచ్చి మనలను నొప్పించలేవు. చూసి నడిచే నేర్పు మనకుంటే తప్పించుకు తిరగవచ్చు. పడవ నీటిలో ఉన్నా పడవలోకి నీరు ప్రవేశించనపుడు మునిగిపోయే ప్రమాదం లేనట్లు, బ్రతుకులో బాధలు చుట్టుముట్టినా అవి గుండె భారాలుగా మారకపోతే జీవననౌక సురక్షితంగా తీరాన్ని చేరగలుగుతుంది. అందుకే 'ప్రపంచంలో ఎన్ని జరిగినా ఫరవాలేదు. నీలో ఏదీ జరగకుండా చూసుకో' అని గురుదేవులు పదేపదే మనలను హెచ్చరిస్తూ ఉంటారు.

ఏ బాధా లేని జీవితం ప్రపంచం లోనే కానరాదు. చెప్పుకోగలిగే బాధలు కొన్ని, చెప్పుకోలేని బాధలు కొన్ని. చెప్పుకున్నా ఉపయోగం లేని బాధలు మరికొన్ని. వినేవారిలో కూడా సానుభూతితో వినేవారు కొందరు. వినోదానికి వినేవారు కొందరు. విని విమర్శించే వారు కొందరు. అందరికి చాటుతూ ఆనందించేవారు మరికొందరు. కడుపులో దాచుకునే



కన్నతల్లి అయినా, బాధలను పంచుకునే భార్య అయినా బాధలను మరపించే ప్రయత్నం చేయగలరే గాని బాధలను నిర్మూలించలేరు. మరచిపోయేవి ఏవైనా గుర్తురాకపోవు. గుర్తు వచ్చిన క్షణాన బాధించకమానవు. బాధలను సమూలంగా నశింపజేయగల శక్తి ఒక్క భగవంతుడికే ఉంది. భగవంతుడి దయవల్ల సంసారబాధలు సమూలంగా నశిస్తాయి.

భావాలను గ్రహించే భగవంతుడు ఆలోచనకే ఆధారమై ఉన్నాడు. ఆలోచనకే ఆధారమైనవాడి నుండి ఆలోచనలను దాచడం సాధ్యపడదు. దాచడం సాధ్యంకానపుడు వ్యక్తం చేయడం మాత్రం అవసరమా? మన బాధలు భగవంతుడికి తెలియనివి కావు. అయినా, బాధలలో మన అవగాహన ఏమిటో, మనము గ్రహించిన బోధ ఏమిటో మన మాటల లోనే వినాలని భగవంతుడు అనుకుంటాడు. తాను నేర్పిన పాటే అయినా బిడ్డ పాడితే వినాలని తల్లి ఉబలాటపడుతుంది. ఒకే పాట అందరినోట ఒకేలా పలకదు. ఎవరి గాన మాధుర్యం వారిదే. ఎవరి భావసౌందర్యం వారిదే.

బాధలు పది మందికి చెప్పుకొని ఓదార్పును ఆశించే వారే ఎక్కువ మంది. పరులకు చెప్పుకునే బాధలు చేదు జ్ఞాపకాలుగా మిగిలి పోతాయి. భగవంతుడికి విన్నవించుకునే బాధలు భావమాధుర్యాన్ని సంతరించుకొని మధురబాధలుగా, తీయని గాథలుగా రూపుదిద్దుకుంటాయి. కోనేటిస్నానం సర్వపాపహరం. పరమాత్మకు చేసే కన్నీటి పాదాభిషేకం సర్వదుఃఖహరం. అందుకే,

**వినిపించలేదా కోనేటిదేవా కన్నీటి నాగాథ**
**అడుగు అడుగుకు కొండలస్వామి దండము గైకొనవా!**

అంటూ, బ్రతుకులో అడుగడుగునా గండాలే గనుక ఆపదమొక్కులవాడికి అడుగడుగునా దండాలంటూ భక్తుల గుండెభారాన్ని దించుతున్నారు పూజ్య స్వామీజీ.

భగవంతుడి ప్రేమ తప్ప అన్యమైన దానిని ఆశించని గురుదేవుల దృష్టిలో బంగారమైనా తృణప్రాయమే. అలసట తెలియని తమ పరిశ్రమ లన్నీ భగవంతుడి ప్రీత్యర్థమే చేస్తూ ఉంటారు. పాడినా ఆ పాటలే, మాటాడినా ఆ మాటలే. నీకై నిరంతరం కలవరించే నన్ను పలుకరించడం నేరమా? అని భగవంతుడిని చిక్కటి చెలిమితో నిలదీస్తున్నారు. గోవిందుడి గుడిలో గోడలు బంగారం, తలుపులు బంగారం. గోపురం బంగారం, శిఖరం బంగారం. అలంకారాలు బంగారం, ఆసనాలు బంగారం. అభయ మిచ్చే చెయ్యి బంగారం, శరణమిచ్చే పాదం బంగారం. అయినా, అవన్నీ నీకే సింగారం, నీ పలుకొక్కటే నాకు బంగారం, అంటున్నారు గురుదేవులు. అందుకే,

**పలుకుచుంటిని పాడుచుంటిని పలుకరింతువని**
**పలుకుబడిగల బంగారు గుడిలో పలుకే బంగారమా!**

ద్వాపరయుగంలో గొల్లభామలతో స్వేచ్ఛగా ఆడిపాడిన గోవిందుడు, కలియుగంలో బంగారుగుడిలో బందీగా మారి పలుకే బంగారమన్నట్లు మూగబోవడానికి గల కారణ

మేమిటి? కలియుగంలో చెలిమి కన్నా కలిమిదే బలమా? అని భగవంతుడిని నిష్ఠూర మాడుతున్నారు పూజ్య స్వామీజీ.

ఏ సేవకు భగవంతుడు సంతసిస్తాడో! ఏ పలుకుకు మందహాసం చిందిస్తాడో! ఏ పాటను పరవశించి ఆలకిస్తాడో! ఏ ఆటను ఆనందంతో తిలకిస్తాడో! తన సర్వస్వాన్ని భగవత్కైంకర్యంగా సమర్పించిన గురుదేవులలో అహర్నిశలు ఇవే ఆలోచనలు. గొల్లపల్లెలో గొల్లపిల్లల కళ్ళకు గంతలు కట్టి దాగుడుమూతలు ఆడాడు. రేపల్లెలో గోపెమ్మల కళ్ళు కప్పి వెన్నను దొంగిలించాడు. ఆనాడు గర్వాంధుడైన ఇంద్రుడికి కనువిప్పు కలిగించాడు. నేడు కలి ఘోరాలను చూడలేకనో ఏమో తానే కళ్ళు మూసుకున్నాడు. యుగాలు మారినా భగవంతుడికి భక్తుడికి గల అనుబంధం మారునా? నాడైనా నేడైనా భక్తుడు పిలిస్తే భగవంతుడు పలుకుతాడు. భక్తుడు కలవరిస్తే భగవంతుడు కనికరిస్తాడు. అందుకే,

**చెప్పుచుంటిని కథలను తియ్యగా కనికరింతువనీ**
**నామాల మాటున చూపును దాచితే ఎవరితో మొరలిడుదూ?**

అంటూ, కనిపించని, వినిపించని దేవుడు చూడటం, వినిపించుకోవటం కూడా మానేస్తే ఇక భక్తుడికి దిక్కెవరు అని ఆ కొండదేవుని, కోనేటిరాయుని వేడుకుంటున్నారు పూజ్య స్వామీజీ. పూలే లేనిచోట తుమ్మిపువ్వైనా చాలు. పూలులేని లోటు తుమ్మిపువ్వు తీర్చినా తుమ్మిపువ్వు ఏనాటికి తామరపువ్వు కాలేదు. చిన్నచిన్న సుఖాల వల్ల జీవితంలో అప్పుడప్పుడు ఆనందం దొరికినా, సంసార దుఃఖాన్ని ఉపశమింపజేసే శక్తి ప్రాపంచిక సుఖాలకు లేదు.

తారలన్నీ ఒక్కటై వెలిగినా సూర్యప్రకాశానికి సాటిరావు. ప్రాపంచిక సుఖాలన్నీ ఏకమైనా పారమార్థిక సుఖాన్ని కలిగించలేవు. పూజలు చేస్తే భగవంతుడు ప్రత్యక్షమవుతాడని, వ్రతాలు చేస్తే వరాలిస్తాడని, నోములు నోచితే కోరికలు తీరుస్తాడని పరిపరివిధాలుగా అల్పబుద్ధితో భగవంతుడిని కొలిచేవారే అందరు. ఎవరు ఏవిధంగా తనను ఆశ్రయిస్తే వారిని ఆవిధంగానే అనుగ్రహిస్తానని భగవద్వాణి. పరమాత్మ కన్నా అన్యంగా మరేది పొందినా ఆశ నిరాశే అవుతుంది. పరితాపమే ఫలితంగా మిగులుతుంది. అందుకే,

**దిక్కులు తిరుగుచు చిక్కులు పడితి చిక్కెదవని నీవు**
**పరితపించుచు ప్రక్కన చేరితి పరిహసించకయ్యా!**

అంటూ, పరమాత్మ కొరకే పరమాత్మను ప్రార్థించే భక్తుడికే సంసారతాపాలు చల్లారి నిత్యశాంతి చేకూరుతుంది అంటున్నారు పూజ్య స్వామీజీ.

సంసారం రావిచెట్టు లాంటిది. రావిచెట్టు మహావృక్షమే అయినా అందులో సువాసన నిచ్చే పూలు లేవు, ఆకలి తీర్చే పండ్లు రావు. ఆగక చలించే సన్నని ఆకులు సూర్యకిరణాలను ఆపలేవు కనుక అలసిపోయిన వారు సేదదీరేందుకు నిండైన నీడైనా లేదు. ఏ విధం గానూ సుఖాన్ని ఇవ్వలేని రావిచెట్టు వంటిది ఈ సంసారవృక్షం.




కర్మఫలాలు అందినపుడు సుఖదుఃఖాలు ప్రాప్తిస్తాయి. కర్మఫలాలకు భగవంతుడి దయ తోడైతే మనసులో సంతోషం, సమత్వం చోటు చేసుకుంటాయి. భక్తుడికి ప్రారబ్ధఫలంగా ఎదురు దెబ్బలు తగిలినా నొప్పి కలుగదు. ఆపదలు ఎదురైనా ఆవేదన కలుగదు. కష్టాలు వచ్చినా కన్నీళ్ళు రావు. బాధించేవారు ప్రక్కనే ఉన్నా బాధలను మరపించే భగవంతుడు ఆంతర్యంలో అండగా ఉంటాడు. అందుకే,

**ఆడాడ తిరిగి అలసిపోయాను ఆదుకో స్వామీ!**
**తిరుగుడు తల తిరుగుడు మాని నీ గుడి తిరిగెదను**

అంటూ, ప్రపంచం చుట్టూ పరిభ్రమించడం మాని పరమాత్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, ఆవేదనలను నివేదనలుగా, ప్రతిచర్యలను ప్రార్థనలుగా మలచుకోగల భక్తుడిని బాధలలో కూరుకు పోనివ్వక, బ్రతుకులో ఓడిపోనివ్వక, భగవంతుడు సదా ఆదుకుంటాడు, కాపాడుకుంటాడు. బుద్ధిలో వివేకదీపాన్ని వెలిగిస్తాడు. వైరాగ్య వెలుగుల్ని నింపుతాడు. జ్ఞానజ్యోతుల్ని ప్రకాశింపజేస్తాడు అంటూ భక్తవిజయాన్ని పరవశించి పాడుతున్నారు పూజ్య స్వామీజీ.

# సంతాపము



అయిదు దశాబ్దాల క్రితం పూజ్య గురుదేవుల బోధలతో ప్రభావితమై తన యావజ్జీవితాన్ని గురుదేవుల సేవలో చరితార్థం చేసుకున్న ధన్యజీవి

***శ్రీమతి టి. సుశీలాబాయి, బి.ఏ.***

1984 సంవత్సరం, ధవళేశ్వరం ఆశ్రమ ప్రారంభం నుండి ఆశ్రమానికి నిత్య సేవ లందించిన ఈ భక్తురాలిని గురుదేవులు ప్రేమతో 'మాతాజీ!' అని పిలిచేవారు.


86 సంవత్సరాలు పవిత్రంగా జీవించిన పుణ్యజీవి శ్రీమతి సుశీలాబాయి, 2025, జూన్ 15వ తేదీన స్వర్గస్తురాలైనారన్న వార్త విని గురుదేవులు కంటతడి పెట్టారు.

గురుదేవుల హృదయంలో చెదరని స్థానాన్ని పొందగలిగిన పుణ్యజీవి శ్రీమతి సుశీలాబాయి కైవల్యప్రాప్తికి ప్రార్థిస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నాము. గురుగోవిందుల కృపావృష్టి ఆమెపై సదా వర్షించు గాక!

**ఆశ్రమ కమిటి**
**సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్**

# హనుమద్వైభవం

స్వామి సుందర చైతన్యానంద



హనుమంతుడు గొప్ప రామభక్తుడు. ఇతరులకు సాధ్యం గాని కార్యాలను హనుమంతుడు ఎన్నో సాధించాడు. తనను ఆశ్రయించిన భక్తులను రక్షించాడు. హనుమంతుని భక్తి చేసిన వారికి బుద్ధి బలం కలుగుతుంది. దేహబలం, దేహారోగ్యం పెరుగుతుంది. చక్కగా మాట్లాడే శక్తి అలవడుతుంది. భయ మనేది ఉండనే ఉండదు. అందుకనే, మనం ఆంజనేయస్వామిని భజిస్తూ ఉంటాము. భగవంతుని భజన చేసేటప్పుడు ముందుగా విఘ్నేశ్వరుని కీర్తించి, సమాప్తి చేసే టప్పుడు హనుమ ద్భజన చేయడం భజనలో మన పూర్వీకులు ఏర్పరచిన సంప్రదాయము.

భజన కార్యక్రమము నిర్విఘ్నముగా సాగటానికి గణపతిని భజిస్తాము. భజన ఫలమును అనుగ్రహించమని చివరగా హనుమంతుని కీర్తిస్తాము. కనుక, మీరు క్రింది శ్లోకాన్ని కంఠస్థం చేసి, ప్రతిరోజు చెప్పుకోండి. దాని వల్ల మీకు అనేక లాభాలు కలుగుతాయి. ఏయే లాభాలు కలుగుతాయి అంటారా? అవేమిటో ఈ శ్లోకం చెబుతుంది. చూడండి.

**బుద్ధి ర్బలం యశో ధైర్యం నిర్భయత్వ మరోగతా**
**అజాడ్యం వాక్పటుత్వం చ హనుమ త్స్మరణా ద్భవేత్ ॥**

హనుమత్ స్మరణాత్=హనుమంతుని స్మరించుట వల్ల, బుద్ధిః=జ్ఞానము, బలం=శక్తి, యశః=కీర్తి, ధైర్యం=ధైర్యము, నిర్భయత్వం=భయము లేకుండుట, అరోగతా=ఆరోగ్యము, అజాడ్యం=సోమరితనము లేకుండుట, చ=మరియు, వాక్పటుత్వం=మాటలలో నేర్పరితనము, భవేత్=కలుగుతాయి.

**భావము :- ఆంజనేయస్వామిని స్మరిస్తే బుద్ధి, శక్తి, కీర్తి, సాహసము, నిర్భయత్వము, ఆరోగ్యము, చురుకుదనము, వాక్పటుత్వము తప్పక కలుగుతాయి.**

ఆంజనేయస్వామి అందరికీ ఆదర్శ పురుషుడు. ఆయన జీవితం ఇతరులకు సహాయము చేయడం లోనే సాగిపోయింది. హనుమంతుడు కనిపించాడు అంటే, ఇతరులకు సహాయం చేస్తూనే కనిపిస్తాడు. అందుచేతనే, ఆయన వానరుడైనా సుందరుడు. ఆయన జీవితము సుందరకాండగా భాసించింది.

మనం అందరము ఆంజనేయస్వామిని ఆదర్శంగా తీసుకోవాలి. సదా ఆ మహాత్ముని



స్మరిస్తూ ఉండాలి. ఆయనను స్మరిస్తూ ఉంటే, ఆయన కళ్యాణ గుణాలు మనకు కూడా అబ్బుతాయి. అప్పుడు మనం కూడా ఆంజనేయస్వామి లాగా ఎందరికో, మరెందరికో సాయం చేయగలం.

ఇక, నా విషయం కూడా మీకు చెబుతా. నా బాల్యంలో నేను ఆంజనేయ స్వామిని సేవిస్తూ ఉండేవాణ్ణి. మా ఊరిలో పట్టణ నడిబొడ్డున ఆంజనేయస్వామి ఆలయం ఉండేది. ఆ ఆలయంలో ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం దివ్యంగా శోభిస్తూ ఉండేది.

మా తల్లి ఆంజనేయస్వామికి ప్రతి మంగళవారం ఒక పూల మాల లేదా, తులసిమాల స్వయంగా కట్టి సమర్పించేది. మేము పూలను, తులసిని తోటలలో సేకరించి తెచ్చే వాళ్ళం. ఆలయానికి వెళ్ళి సాయంత్రం మేము పూలమాల సమర్పించే సమయానికి ఆలయంలో భక్తులు హార్మోనియం, తబలాలు పెట్టుకొని ఉత్సాహంగా భజన చేస్తూ ఉండేవారు. కొంతసేపు అక్కడే కూర్చుని నాలుగైదు భజనలు ఆలకించి వచ్చే వాళ్ళం. ఆ విధంగా నాకు సంకీర్తనపై మక్కువ ఏర్పడింది.

సంవత్సరానికి ఒకసారి ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగేవి. ఆ ఉత్సవాలలో ఒకనాడు మా అమ్మ ఊహించలే నంత పెద్ద పూలమాల కట్టేది. ఆ సందర్భంలో మా నాన్నతో సహా మా కుటుంబీకు లందరూ ఆ సేవలో పాల్గొనే వారు. మేము సేకరించి తెచ్చే పూలు సరిపోయేవి కావు. మా నాన్న గారు మార్కెట్టులో ఎక్కువగా పూలు కొనేవారు. ఆ మాలను మోసే శక్తి మాకు అప్పుడు ఉండేది కాదు. మా నాన్న గారు, ఆయన మిత్రులు కొందరు మోసుకొని వెళ్ళేవారు. మేము వారితో కూడా నామం చెబుతూ వెళ్ళే వాళ్ళం. అలా సమర్పించిన మాలతో శోభిస్తున్న ఆంజనేయ స్వామి ఫోటో ఇప్పటికీ నా వద్ద ఉంది. ఈ ప్రక్క ఫోటో అదే. నేను ఆరవ తరగతి, ఏడవ తరగతి చదువుతున్న రోజుల్లో జరిగిన విషయం మీకు చెబుతున్నాను.



అంటే 1958, 1959 సంవత్సరాలలో జరిగిన సంఘటనలు. అయినా, ఇప్పటికీ నా స్మృతి పథంలో అవి నూతనం గానే ఉన్నాయి. మధురం గానే ఉంటాయి.

నేను ప్రవచనాలు ప్రారంభించిన తరువాత ఆంజనేయస్వామి భజన ఎంతగానో చేశాను. భక్తుల చేత చేయించాను. హనుమంతునిపై అనేక పాటలు వ్రాశాను. భజనలు వ్రాశాను. క్యాసెట్లు విడుదల చేశాను. ఆయనపై అనేక పుస్తకాలు, వ్యాసాలు వ్రాశాను. ఆంజనేయస్వామి అనుగ్రహం నా మీద ఎంతో ఉందని నేను భావిస్తూ ఉంటాను.

నా ప్రవచనాలను ఆలకించిన వారు నా వాక్పటుత్వాన్ని, ప్రవచన ప్రాభవాన్ని గూర్చి శ్లాఘించి నపుడు నాకు ఆంజనేయస్వామి గుర్తుకు వస్తూ ఉంటాడు. బాల్యంలో నేను చేసిన హనుమత్సేవ నన్ను కాపాడుతూ ఉందని భావిస్తూ ఉంటాను.

నా శిష్యులు, భక్తులు, సత్సంగ సభ్యులు సదా హనుమంతుని స్మరిస్తూ, **'త్వమస్మిన్ కార్య నిర్యోగే'** అనే శ్లోకాన్ని పఠించిన తరువాతే ఏ కార్యాన్నైనా చేస్తూ ఉంటారు. ఇలా చేయవలసిందిగా నేను వాళ్ళకు చెప్పడమే గాక, నేను రచించిన 'చైతన్య రామాయణం'లో కూడా ప్రత్యేకంగా వ్రాశాను.

మీరు కూడా ఆంజనేయస్వామిని ప్రతిరోజూ స్మరించండి. పూజించండి. కీర్తించండి. పైన చెప్పిన శ్లోకాన్ని కంఠస్థం చేసి, భక్తితో నిత్యమూ పఠించండి. దాని యొక్క ఫలితాన్ని భవిష్యత్తులో మీరూ అందుకుంటారు.

## అభయ వాక్యం

***( చైతన్య రామాయణం నుండి )***

**శ్లో ॥ త్వ మస్మిన్ కార్య నిర్యోగే**
**ప్రమాణం హరిసత్తమ ।**
**హనుమన్ యత్న మాస్థాయ**
**దుఃఖ క్షయకరోభవ ॥**

'హనుమంతుడా! ఈ కార్యనిర్వహణలో నీవే ఆలోచించాలి. నీ ప్రయత్నముతో నా దుఃఖాన్ని పోగొట్టు' అన్నది సీతమ్మ. తథేతి - 'అలాగే' అన్నాడు హనుమంతుడు.

ఇక్కడ నాదొక్క సలహా. జీవితమొక భయంకర సంగ్రామము. ఎప్పుడు, ఏ వైపు నుండి, ఏ విధమైన కష్టా లొస్తాయో, దుఃఖా లొస్తాయో తెలియదు. వాటిని పోగొట్టుకొనే ప్రయత్నంలో మనం ఎంతో శ్రమిస్తూ ఉంటాము.

మీకు కష్టాలు వచ్చినప్పుడు గాని, బాధలు ఎదురైనపుడు గాని, సమస్యలు భయంకరంగా తలెత్తినపుడు గాని, వాటి పరిష్కారానికి మీరు యత్నించబోయే ముందు, హనుమంతుని మనసులో భక్తితో ప్రార్థించి, పై శ్లోకాన్ని మూడుసార్లు ధ్యానించండి. తరువాత మీ ప్రయత్నాన్ని సాగించండి. ఆంజనేయుడు మీకు అండగా ఉండి మీ కార్యాన్ని సఫలీకృతం చేస్తాడు.




# జగద్గురు జీవితము

ధారావాహిని-3

**స్వామి సుందర చైతన్యానంద**

## గురుశిష్యులు



స్వాతి చినుకుకు ముత్తెపు చిప్పకు గల అవినాభావ సంబంధమే గురుశిష్య వైభవంలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. గురువును గ్రహించ గలవాడు శిష్యుడు. శిష్యుని అనుగ్రహించ గలవాడు గురువు.

సంచార యతి వలె చరిస్తున్న బాల శంకరులు రెండు మాసాలు పయనించి నర్మదా నదీ తీరాన ఉన్న ఓంకారనాథ క్షేత్రం చేరారు. ఆ పవిత్ర నదీ తీరంలో గోవింద భగవత్పాదుల వారు ఉన్నట్లు శంకరులు విన్నారు. ఆ మహాత్ముని దర్శించడానికి శంకరుల హృదయం ఉప్పొంగుతున్నది. వారి నివాస మెక్కడ? ఎలా దర్శించాలి? ఎందరిని అడిగినా సరియైన సమాధానం లభించలేదు.

స్థానికులను అడిగారు. సందర్శకులను ప్రశ్నించారు. సన్యాసులను అభ్యర్థించారు. మాకు తెలియదు - మాకు తెలియదు. . . ఎందరిని అడిగినా ఒకే సమాధానం.

'నాయనా! ఇక్కడికి సమీపంలో ఒక గుహ ఉన్నది. అక్కడ కొందరు సాధువులు నివసిస్తున్నారు. వారిని అడిగి చూడు' అని ఒకరు అన్నారు.

బాల శంకరులు బయలుదేరారు. గుహను సమీపించారు. సాధువులను దర్శించారు. నమస్కరించారు. గోవింద భగవత్పాదుల నివాసం గూర్చి ప్రశ్నించారు.

'మాకూ తెలియదు. కానీ ఆ చిన్న గుహలో ఒక మహాత్ముడు చాలా కాలంగా ధ్యానమగ్నుడై ఉన్నట్లు విన్నాం. ఆయన దర్శనార్థమై మేము ఇక్కడ నిరీక్షిస్తున్నాం' అని సాధువులు పలికారు. ఆలయ ద్వారాన్ని సమీపించినంత మాత్రాన భక్తులకు దైవ దర్శనం లభిస్తుందా? అర్చకుడు వచ్చిన తర్వాతే ద్వారం తెరుచు కుంటుంది. దైవం కంట పడతాడు.

సాధువుల నిరీక్షకు తెరపడే సమయం ఆసన్నమైంది. చీకటి తెరలు తొలగి వెలుగు కిరణాలు జాలువారే దివ్య ముహూర్తం చేరువైంది. అజ్ఞానాంధకారం అంతరించి విజ్ఞాన ఉషోదయమయ్యే శుభ ఘడియ సమీపించింది.

శంకరులు గుహలో ప్రవేశించారు. కనులు అరమోడ్చి గురువును స్తుతిస్తూ ప్రార్థించ సాగారు. గోవింద భగవత్పాదుల వారు సమాధి నుండి బహిర్ముఖులై, మెల్లగా కళ్ళు తెరిచారు. శంకరులను వీక్షించారు. 'కస్త్వం?' ఎవరు నీవు? అని ప్రశ్నించారు.

శ్రీ శంకరులు గురుదేవులకు సాష్టాంగ దండ ప్రణామం ఆచరించారు. లేచి నిలబడి చేతులు జోడించి నమస్కరిస్తూ సమాధానంగా పది శ్లోకాలు చెప్పారు. అవే 'దశ శ్లోకి' పేరుతో ప్రాచుర్యం పొందాయి. తానెవరో ఈ పది శ్లోకాల ద్వారా గురుదేవులకు విన్నవించు కున్నారు శ్రీ శంకరులు.

***శ్లో॥ న వర్ణా న వర్ణాశ్రమాచార ధర్మా***
***నమే ధారణాధ్యాన యోగాద యోపి।***
***ఆనాత్మా శ్రయాహం మమాధ్యాస హానాత్***
***తదేకో వశిష్టఆ శివః కేవలోహమ్ ॥***

'కులాలు నేను కాను, వర్ణాశ్రమాది ఆచార ధర్మాలు నేను కాను. ధారణ ధ్యాన యోగాది సాధనలు నేను కాను. 'నేను - నాది' అనే ఈ భ్రాంతి అనాత్మ లోనే చోటు చేసుకొన్నది. జ్ఞాన రూపమైన, మంగళకరమైన, శుద్ధమైన అఖండాత్మనే నేను'.

ఆత్మ కన్నా వేరైనది అంతా అనిత్యం. అసత్యం. ఆత్మ సర్వాధారం. నిరాధారం. అట్టి అఖండాద్వైత పర బ్రహ్మమే తానని శ్రీ శంకరులు గోవింద భగవత్పాదులకు సమాధాన మిచ్చారు. గోవింద భగవత్పాదులు శ్రీశంకరులను ఆశీర్వదించారు. శ్రీశంకరులు ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాజ్ఞాని అని, కేవలం సంప్రదాయాన్ని రక్షించడానికి తన వద్దకు శిష్యుడుగా వచ్చాడని గ్రహించారు.

గోవింద భగవత్పాదుల వారు మాండూక్య కారికా కర్తలైన గౌడపాదుల వారి శిష్యులు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు. అయినా వారి ప్రాముఖ్యం ఆశించి నంతగా మనకు ఎక్కడా గోచరించదు. దానికి ప్రబల కారణం ఒక్కటే తోస్తున్నది. వారు గ్రంథాలను అందించక పోవటమే నని భావించటం సహేతుకమనే నా అభిప్రాయం.

బ్రహ్మసూత్రాల ద్వారా బాదరాయణులు, భాష్యాల ద్వారా శ్రీ శంకరులు, కారికల ద్వారా గౌడపాదులు మనకు తెలిశారు. గోవింద భగవత్పాదులను స్మరించుకొనడానికి వారు రచించిన గ్రంథాలు ప్రాచుర్యంలో లేవు. కానీ శ్రీ శంకరుల చేత భాష్యాలను అనుగ్రహింప చేసిన ఘనత శ్రీ గోవింద భగవత్పాదుల వారిదే. శ్రీ శంకరుల లోని అసమాన ప్రతిభను గుర్తించి, దానిని సమాజానికి సమర్పించి, వినియోగ పరచిన ఖ్యాతి గోవింద గురువులకే చెందుతుంది. ఎలా? శంకరుల అసమాన ప్రతిభను సమాజానికి ఉపకరించేటట్లు గోవిందుల వారు ఎలా రూపు దిద్దారు?

***(సశేషం)***



# మంగళ దీపాలు

ధారావాహిని-16

**స్వామి సుందర చైతన్యానంద**

## హెచ్చరిక

శ్లో॥ ఆయుర్వర్ష శతం నృణాం పరిమితం రాత్రౌ తదర్ధం గతమ్
తస్మార్ధస్య పరస్య చార్ధమపరం బాలత్వ వృద్ధత్వయోః ।
శేషం వ్యాధి వియోగ దుఃఖ సహితం సేవాది భిర్నీయతే
జీవే వారి తరంగ బుదవుదసమే సౌఖ్యం కుతః ప్రాణినామ్ ॥

**భావము : మానవుని ఆయుర్దాయము వంద సంవత్సరాలకు పరిమితమైంది. ఇందులో సగ భాగం రాత్రుల యందు నిద్రలో హరించి పోతూ ఉంది. అందులో సగభాగం బాల్యంలో, వృద్ధాప్యంలో గతించి పోతూ ఉంది. అందులో సగభాగం వ్యాధులతో, వియోగ శోకం, దుఃఖంతో, పరులను సేవించడంతో సరిపోతూ ఉంది. జీవితం సాగర తరంగాలలో గోచరించే నీటిబుడగ లాగా ఉంది. ఇక ప్రాణులకు సుఖ మెక్కడ కలుగుతుంది?**


### వ్యాఖ్య

అంత మెక్కడో, ఎప్పుడో తెలియని మానవుడు జీవితం ఎంతో ఉందని భ్రమిస్తూ వింత వింత పోకడలతో కాలాన్ని వృథా చేసుకుంటూ ఉంటాడు. కాలం చాలా విలువైంది. కాలుని నోట పడక ముందే నావ తీరాన్ని చేరేలా చూసుకోవాలి. మానవుని పూర్ణ ఆయుర్దాయం వంద సంవత్సరాలు. అందులో సగ భాగం, అనగా యాభై సంవత్సరాలు నిద్రలో కారిపోతూ ఉంది. నిద్రించు సమయాన మనిషికి బండకు తేడా ఏముంది? జడరూప వస్తువు లాగా యాభై సంవత్సరాలు నిరర్థక మవుతున్నాయి. ఇక మంచి చేసేందుకు, సంచితాన్ని నశింప చేసుకునేందుకు యాభై సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇందులో సగ భాగం, అనగా ఇరవై అయిదు సంవత్సరాలు బాల్యంలో, వృద్ధాప్యంలో గడిచి పోతున్నాయి. బాల్య వృద్ధాప్యాలు రెండు కూడా ఇతరులపై ఆధారపడి జీవించ వలసిన దశలు. బాల్యంలో తనను కన్నవారిపై ఆధారపడాలి. వృద్ధాప్యంలో తాను గన్న వారిపై ఆధారపడాలి. ఇక కేవలం ఇరవై ఐదు సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి కూడా శారీరక వ్యాధులతో, మానసిక మైన వియోగ బాధలతో, భౌతిక జీవన దుఃఖంతో, కుటుంబ శోకంతో కదిలి పోతూ ఉన్నాయి. ఎక్కువ కాలం ఇతరులను భుక్తి కొరకు సేవించటం లోనే నిరుపయోగ మవుతూ ఉంది. ఇక మంచితనాన్ని పెంచు కొనేందుకు, మనిషితనాన్ని తనలో దించుకొనేందుకు మానవునికి సమయ మెక్కడుంది? 'చేద్దాంలే - చూద్దాంలే' అనుకుంటూ కాలయాపన చేస్తూ ఉన్నాడు.

***(24వ పేజీ చూడుము)***

# సాధన సౌలభ్యానికి ద్వాదశ సోపానాలు

స్వామి సుందర చైతన్యానంద



ఆత్మబంధువులారా! ఈ లోకంలో జీవిస్తున్న మనందరము తెలిసినా, తెలియక పోయినా ముముక్షువులమే. సర్వులకు మోక్షమే పరమ పురుషార్థమై, ఏకైక గమ్యమై ఉంది.

అనుభవాలు గడించడానికి, అనుభవాల మధ్య ప్రపంచం యొక్క నిస్సార మనుగడను గుర్తించి అంతర్ముఖం కావడానికి లోకం దోహద పడుతుంది. ప్రపంచం గొప్ప విలువైంది కాదని, ప్రపంచం యొక్క అర్థం ప్రపంచంలో లేదని, పరమార్థం లోనే ఉందని సుస్పష్ట మవుతుంది. ఈ సందర్భంగా పన్నెండు అక్షరాలతో శోభించే ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని కొన్ని దశాబ్దాలుగా మీ చేత పలికించిన నేను, మీరు ఆలోచించడానికి, ఆచరించడానికి పన్నెండు విషయాలను మీకు చెబుతున్నాను.

*(1)* మనకు లేని దేమిటి? మనకు కావలసింది ఏమిటి? అనే రెండు ప్రశ్నలను ఎవరికి వారుగా తమపై సంధించుకొని వాటికి సమాధానాల్ని రాబట్టు కోవాలి. మనం పొంద దగినది, పొంద వలసింది మోక్షమే అని కనుక ఆంతర్యం చెబితే, మరి దానిని పొందే ప్రయత్నం మనం ఏమి చేస్తున్నాము? అని తిరిగి మనస్సును ప్రశ్నించుకోవాలి. ఒకవేళ, కావలసింది మోక్షము కాదు అనిపిస్తే, మరేది అవసరమో చెప్పమని ఆంతర్యాన్నే నిలదీయాలి.

ఏదో ఏదో పొందాలని ఆరాటపడే వారు ఏదీ పొందలేరు. మనకు కావలసిందేమిటో మనకు క్షుణ్ణంగా తెలిసినపుడే సాధన తేజోమయ మవుతుంది. ప్రయాణం సుగమ మవుతుంది.

ఒక వైపు ప్రారబ్ధ సాగరంలో పడి కొట్టుమిట్టాడుతూ ఉన్నా, పరమ పురుషార్థమైన మోక్ష సాధన వైపే మన దృష్టి కేంద్రీకృతమై ఉండాలి. ప్రతిబంధకాలను అర్థం చేసుకుంటూ పోతే అవి ప్రగతి నిరోధకాలు కాకుండా ఉంటాయి.

*(2)* ఇతరులు మీ సాధనకు అవరోధాలు కాకుండా చూసుకోండి. ఈ లోకంలో ఎవరు ఎలా ఆలోచించగలరో అలాగే ఆలోచిస్తారు. అలా ఆలోచించడం వెనుక నివారించడానికి వీలు లేని విధంగా నియతి ఉంది. అందుచేత ఒకరి ఆలోచనలను మరొకరు మోసుకుంటూ తిరగలేరు. ఒకరి మనస్సులో ఇమిడిపోయి మరొకరు జీవించలేరు. ఎవరు ఎలా ఉంటే అలా ఉండనివ్వండి.

*(3)* ఇతరులు నీ విషయంలో ప్రతికూలంగా ఉన్నంత మాత్రాన వారి వల్ల నీకు కష్టాలు కలుగుతాయేమో, మనుగడ మరోలా మారుతుందేమో అనే సందేహాలతో భయాలను పెంచుకో వద్దు. ఇలాంటి భయాలతో సాధనపరంగా ధ్యానం సాగదు. జ్ఞానపరంగా విచారమూ కొనసాగదు. ధ్యానం సాగకపోతే మనస్సుకు నిశ్చలత్వం రాదు. విచారం సాగక పోతే జ్ఞానం బుద్ధికి పట్టదు. నీ ఉన్నతిని మరొకరు పెంచనూ లేరు. నీ ప్రగతిని మరొకరు చెడగొట్టనూ లేరు. ప్రారబ్ధ ఫలాల విషయంలో నీకు సహకరించ గలవారు ఇద్దరే ఉన్నారు. ఒకడు గోవిందుడు. మరొకడు గురువు.



*(4)* ధ్యానానికి ప్రతిబంధకాలైన విషయాలను బుద్ధిలో పెట్టుకొని ధ్యానాన్ని కొనసాగించడం సాధ్య పడదు. గతంలో జరిగిన వన్నీ వాస్తవాలే. వాస్తవాల్ని అంగీకరించండి. జరిగి పోయిన వాస్తవాల విషయంలో మనం చేయ గలిగింది ఏమీ లేదు. గతాన్ని సంపూర్ణంగా అంగీకరించండి. అంతే. ఆ క్షణం నుండి హృదయం తేలిక పడుతుంది. ధ్యానం నిరాటంకంగా సాగుతుంది. విచారము నిరంతరము కొనసాగుతుంది.

*(5)* గతంలో జరిగిన బాధాకరమైన సన్నివేశాలను సంపూర్ణంగా అంగీకరించి, వాటికి కారణభూతులైన వారిని ఎలా క్షమిస్తున్నావో, అలాగే, ఒకవేళ అలాంటి సన్నివేశాలకు నీవే కారణమై ఉంటే, నిన్ను కూడా నీవు క్షమించుకొనే స్థాయిలో ఉండు. తప్పు చేసింది నా అజ్ఞానమే గాని నేను కాను. నేను అకర్తనే గాని కర్తను గాను అనే ఆత్మ విచారంలో నిలిచిపో. గతాన్ని గతానికి విడిచి పెట్టేయ్.

*(6)* మన జీవితంలో జరిగే ఏ విషయాని కైనా పరమేశ్వరుని అనుమతి ఉందా, లేదా? జరిగినవి సంభవాలా, అసంభవాలా? అనివార్యాలు ఉంటాయేమో గాని అసంభవాలు ఉంటాయా? జరిగే ప్రతి సన్నివేశం వెనుక నియతి ఉంది. భగవంతుని అనుమతి ఉంది. భగవంతుడు అనుమతించి అందించిన ఫలాన్ని నిరాకరించే శక్తి మనకు ఉందా? మృత్యువు కూడా ఒక సన్నివేశమే. కర్మఫలమే. మన దుఃఖానికి కారణం ఏ సన్నివేశమూ కాదు. పరిమితమైన జ్ఞానం కారణంగా సన్నివేశాలను అర్థం చేసుకోలేక పోవడమే దుఃఖానికి కారణము అనేది సదా స్మృతిలో ఉంచుకోండి.


*(7)* దేనిపై మమతను పెంచుకున్నా, అది బుద్ధిలో సమతను దెబ్బ తీస్తుంది. ఎవరిని అతిగా ప్రేమించినా అది జీవన యానాన్ని వక్రగతి వైపు నడిపిస్తుంది. ప్రేమ మంచిదే. అతిప్రేమే అనర్థదాయకం. స్నేహం మంచిదే. అతిస్నేహం (అభిస్నేహం) నిరర్థకం. అతిప్రేమలు సమస్యలకు శ్రీకారం చుడతాయి. సంతాపాలను పెంచి పోషిస్తాయి.

*(8)* ప్రపంచాన్ని గూర్చి అలసిపోయే టంతగా ఎందుకు ఆలోచిస్తావు? ఎంత మందిని గూర్చి ఆలోచిస్తావు? ఎందరిని నీ బుద్ధిలో ఇముడ్చుకో గలవు? వారందరూ నీవు ఆలోచించ దగిన వారేనా? ఈ ఒక్క ఆలోచన చక్కగా చేయ గలిగితే, అన్ని ఆలోచనలు ఆవిరై పోతాయి. ఆవేదన లన్నీ అడుగంటి పోతాయి. మిత్రమా! ఎవరిని గురించి గాని అదే పనిగా ఆలోచించడం మానేయ్. నువ్వు ప్రపంచాన్ని గూర్చి ఎంత అతిగా ఆలోచించినా, ప్రపంచం మాత్రం నిన్ను పట్టించుకోదు. నిన్ను గురించి ఆలోచించే స్థితిలో ఇతరులు లేరు. అర్థం చేసుకో.


*(9)* మొక్కల్ని పెంచినట్లు, కుక్కల్ని పెంచినట్లు కోరికల్ని పెంచుకోవద్దు. కోరికల్ని పెంచుకుంటూ పోతే అవి ఒక దశలో పెరిగి నాలుగు నలభై అవుతాయి - నాలుగు వందలూ అవుతాయి. ఆ దశలో అవి తీరే అవకాశం లేక, తీర్చుకొనే శక్తి మనకు లేక బ్రతుకు బండబారి పోతుంది. అలా కాకుండా, ఉన్న కోరికల్ని పెంచుకోకుండా త్రుంచుకుంటూ వస్తే, ఒక దశలో, తలపై మూటల్ని దించుకున్నట్లు తలలోని తలపుల్ని కూడా దించుకో గలుగుతాం. ఆ దశలో హృదయంలో ప్రశాంతతే రాజ్య మేలుతుంది.

**(24వ పేజీ చూడుము)**

## యజ్ఞ పోషకులు



శ్రీ సి.హెచ్.కృష్ణ ప్రసాద్
అమెరికా
రూ.10,11,012/-
(పది లక్షల పదకొండు వేల పన్నెండు రూపాయలు)



శ్రీమతి బి.పద్మజ
శ్రీ జి.శ్యామసుందర్ రెడ్డి
కుమారి రాజేశ్వరి, అమెరికా
రూ.5,00,000/-
(ఐదు లక్షల రూపాయలు)



శ్రీ కె.వి.అనిల్ కుమార్ రెడ్డి
అమెరికా
రూ.1,00,000/-



శ్రీమతి ఎ.యశోదా శర్మ
హైదరాబాద్, రూ.1,00,000/-



శ్రీమతి డి.సురేఖ
అమెరికా, రూ.1,00,000/-




శ్రీమతి బి.కామాక్షి
అమెరికా, రూ.1,00,000/-




శ్రీమతి డా॥ కె.రజని, శ్రీ కె.శ్రీనివాస్
నిర్మల్, రూ.1,00,000/-



సుందర సత్సంగ్
ఎ.టి.అగ్రహారం, రూ.1,00,000/-



శ్రీమతి విజయలక్ష్మి
డా॥ శ్రీ కె.వి.శేషారెడ్డి
నెల్లూరు, రూ.50,000/-




శ్రీమతి ఎమ్.విమల
శ్రీ ఎమ్.ఎల్.ఎన్.నాగేంద్రకుమార్
హైదరాబాద్, రూ.50,000/-




శ్రీమతి ఎ.రాణి
శ్రీ ఎ.సుదర్శనం
హనుమకొండ, రూ.50,000/-



## మహారాజ పోషకులు
(రూ.10,000/-)




శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్, రూ.30,000/-



శ్రీమతి కె.శ్రీదేవి
శ్రీ కె.రామచంద్రా రెడ్డి
ఆశ్రమం, రూ.25,000/-



శ్రీమతి లక్ష్మీ చందన
శ్రీ సి.హెచ్.రామకృష్ణా రెడ్డి
హైదరాబాద్, రూ.25,000/-



శ్రీమతి డి.మాధవి
శ్రీ డి.భిక్షపతి
హైదరాబాద్, రూ.25,000/-




శ్రీమతి ఎమ్.సత్యవతి
హైదరాబాద్, రూ.25,000/-




శ్రీమతి కె.సుష్మిత
హైదరాబాద్, రూ.20,000/-




ఎమ్.సిరి వైష్ణవి
హైదరాబాద్



శ్రీ కె.కృష్ణమూర్తి
సిద్దిపేట



శ్రీ వై.రమేశ్
పిప్పరవాడ



శ్రీమతి జి.వీరవేణి
శ్రీ జి.గంగరాజు
రాజమండ్రి



శ్రీమతి జె.లక్ష్మి
సికింద్రాబాద్




శ్రీ ఆర్.వెంకటరమణ
నెల్లూరు




చి॥ సి.హెచ్.వసుప్రియ
హైదరాబాద్



శ్రీమతి కె.నాగమణి
శ్రీ కె.ప్రకాశ్
కడప



శ్రీ కె.బి.వి.రామ్ కుమార్
గుంటూరు



శ్రీ కె.ఎస్.రామకృష్ణ
కర్నూలు

(21వ పేజీ తరువాయి)

(10) కాలం చాలా విచిత్ర మైంది. కాలం లోనే అన్నీ మారి పోతాయి. కాలం లోనే అన్నీ కారి పోతాయి. కాలం సాగేదే గాని ఆగేది కాదు. కాలానికి పనితనమే గాని కనికరము లేదు. కాలం తెలివైంది కాకపోవచ్చు. కాని, కాలం చాలా విలువైంది. దాని విలువెంతో తెలిసే లోగా కాలం కరిగి పోతుంది. కరుగుతూ కారిపోయే కాలానికి ఖరీదెంతో కాలం ఉన్నప్పుడే నిర్ణయించుకోగలగాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం లోనే మనం కాలాతీతులం కాగలము. కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటే మళ్ళీ కాటిలో కాపురమే.

(11) ప్రాయశ్చిత్తాలు, పశ్చాత్తాపాలు జీవితాన్ని ప్రభావితం చేయవు. అవన్నీ బాధల గతాన్ని గుర్తు చేసి బాధించేందుకే ఉపకరిస్తాయి. మనిషి పొంగి పోయేందుకు, మనస్సు క్రుంగి పోయేందుకే పనికొస్తాయి. దురద ఉన్నవాడు దేహాన్ని గోకుతూ ఉంటాడు. పశ్చాత్తాప పడేవాడు మనస్సును గోకుతూ ఉంటాడు. ఒక దశలో దానిని మానని పుండుగా మార్చుకుంటాడు. పశ్చాత్తాపాలను ప్రక్కన పడేసి తప్పిదాల నుండి పాఠాలు నేర్చుకొనే లక్షణాన్ని అలవరచు కోవాలి. పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలు పునః పాప జీవనానికి శ్రీకారం చుట్టే ప్రమాదం లేక పోలేదు. పాఠాలు నేర్చుకున్నప్పుడే బ్రతుకు ప్రభావిత మవుతుంది. ప్రవర్తన పరివర్తన వైపు అడుగులు వేస్తుంది.

(12) నిద్ర లేవగనే బ్రతుకును భగవంతునితో ఆరంభించండి. **'కరాగ్రే వసతే లక్ష్మీః'** అనే శ్లోకాన్ని పఠిస్తూ, **'కరమధ్యే తు గోవిందః'** అంటూ అరచేతిలో అచ్యుతుని దర్శించండి. *భగవాన్! నా చేతలు నా చేతుల్లో ఉంటే ఏ ప్రమాదమైనా జరగవచ్చు. బ్రతుకు భగవన్మయం కావాలంటే, నా చేతలన్నీ నా చేతిలో ఉన్న నీ ఆజ్ఞలకు లోబడే ఉండాలి. నీవు నడిపినట్లే నడవాలి. భగవాన్! ఈ రోజు నాది కాకుండా నీది కావాలి'* అంటూ మనల్ని మనం పరమేశ్వరునికి సమర్పించుకోవాలి.

(19 వ పేజీ తరువాయి)


జీవన సాగరంలో కదులుతున్న కెరటంపై నిలిచి ఉన్న బ్రతుకు బుడగపై మానవునికి ఎంత విశ్వాసమో! ఇంతకన్నా భ్రాంతి మరొకటుందా?

మిత్రమా! కళ్ళు తెరచి చూడు. కాలం ఎవ్వరిని కనికరించదు. కాలరూప సుడి గుండానికి ఆహుతి గాకు. కాలాన్ని వినియోగించుకో. కదిలే ప్రతి క్షణమూ పరమాత్మతో ముడిపడి ఉందో లేదో ఆలోచించుకో. ప్రవాహం చాలా తీవ్రమైంది. ప్రస్థానము ప్రసన్నంగా ఉందో లేదో చూసుకో.



# హృదయ దీపం

## స్వామి సుందర చైతన్యానంద



**జ్యోతిః** అంటే ప్రకాశము. ప్రకాశము అంటే ప్రకాశింప చేసేది అని అర్థము. ప్రకాశింప చేసే జ్యోతులు రెండు విధాలు. ఒకటి, తన ప్రకాశానికై మరొక జ్యోతిపై ఆధారపడి ఉండేది. రెండు, స్వప్రకాశమై, తన ప్రకాశానికై మరొక దానిపై ఆధార పడకుండా, సమస్తాన్ని ప్రకాశింప చేసేది. మొదటిది జడ ప్రకాశము. రెండవది చైతన్య ప్రకాశము.

బాహ్య ప్రకాశము లైన ఆదిత్యాదుల నుండి, ఆంతర్యము లోని బుద్ధ్యాదుల వరకు వెలిగే కాంతులన్నీ జడ ప్రకాశాలే. అవన్నీ ఏ ప్రకాశంపై ఆధారపడి ప్రకాశిస్తున్నవో అదే చైతన్య ప్రకాశము. చైతన్యజ్యోతి. అదే క్షేత్రజ్ఞ స్వరూపము. జ్ఞేయ విషయము.

చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుని ప్రకాశం స్వప్రకాశం కాదని మనకు తెలుసు. అది సూర్యుని నుండి గ్రహించిన ప్రకాశము. అందుచేత, చంద్రుని ప్రకాశము జడ ప్రకాశమే గాని స్వప్రకాశము కాదు. మరి కాస్త ముందుకు సాగితే, సూర్యుని ప్రకాశం కూడా స్వప్రకాశం కాదని, జడ ప్రకాశమే నని తెలుస్తుంది.

వేడి పాలు అని అంటాము. పాలు వేడిగా ఉండవు. చల్లగా ఉంటాయి. వేడిపాల లోని వేడి అగ్నిదే గాని పాలది కాదు. అలాగే సూర్యుని లోని ప్రకాశము సూర్యునిది కాదు. చైతన్య ప్రకాశము వల్లనే సూర్యునికి ప్రకాశకత్వము ప్రాప్తిస్తూ ఉంది. ఏ తేజస్సు ప్రాప్తించడము చేత సూర్యుడు ప్రకాశిస్తున్నాడో, ఆ తేజస్సు చైతన్య తేజస్సే నని తైత్తిరీయ బ్రాహ్మణము **(యే సూర్యః తపతి తేజసేద్ధః).** చైతన్య తేజమే స్వప్రకాశము. మిగిలిన ప్రకాశా లన్నీ జడప్రకాశాలే. మరొక దానిపై ఆధారపడి ప్రకాశించే ఈ జడ ప్రకాశాలన్నీ స్వప్రకాశమైన చైతన్యప్రకాశాన్ని అనుసరించే ప్రకాశిస్తున్నాయి. **తస్య భాసా సర్వ మిదం విభాతి** - దాని ప్రకాశం చేతనే ఇదంతా ప్రకాశిస్తూ ఉంది అని కఠ, ముండక, శ్వేతాశ్వతరోపనిషత్తులు మూడూ ప్రముఖంగా ముచ్చటించాయి.

**అయం ఘటః** - 'ఈ కుండ' అన్నప్పుడు, కుండ వెలుగులో ఉంది కనుక, దానిని చూచి 'ఇది కుండ' అంటున్నాము. కుండ తాను ఉన్నట్లు తనకు తానుగా ప్రకటించుకో గలదా? స్వయం ఉద్దీపనం కుండకు సాధ్యమా? సూర్యుని ప్రకాశంలో ఉద్దీప్త మైన ఘటమును

నువ్వు నేత్రంతో చూస్తున్నావు. బాహ్యంలో ఘటము ఉన్నా, అది ప్రకాశంలో ఉన్నప్పుడే, అది ఉన్నట్లు మనకు తెలుస్తుంది.

ఇంకా కాస్త ముందుకు వెళితే, ఘటము సూర్యుని ప్రకాశం లోనే ఉంది. కానీ, చూచే వాడు అంధుడైతే ఎలా తెలుసుకుంటాడు? సూర్యుడు కుండను ప్రకాశింప చేయగలడే గాని, కుండను తెలుసుకోగలడా? తననే తాను తెలుసుకోలేని సూర్యుడు, కుండ నెలా తెలుసుకుంటాడు? సూర్యుడైనా, సూర్య ప్రకాశంలో భాసించే ఘటమైనా నేత్రానికే గోచరం కావాలి. కుండ, కుండను ప్రకాశింప చేసే సూర్యుడు, ఇద్దరూ నేత్రము చేత ప్రకాశింప బడుతున్న వారే.

నేత్రము వస్తువును ప్రకాశింప చేయగలదే గాని వస్తువును తెలుసుకో గలదా? నేత్రము కూడా జడమే. కనుక, నేత్రంలో ప్రతిఫలించే వస్తువును, నేత్రాన్ని ప్రకాశింప చేసే మనస్సు తెలుసుకుంటూ ఉంది. అయితే మనస్సు స్వప్రకాశమా? మనస్సు స్వప్రకాశ మైతే అది ఎప్పుడూ ఉండాలి కదా! సుషుప్తిలో మనస్సు ఉందా? లేదు. కనుక, మనస్సు తెలుసుకోవడ మనేది చైతన్య ప్రకాశం మీద ఆధారపడి ఉంది (**చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం** - కేన భాష్యము). కనుక, బాహ్యం లోని సూర్యాదులు మొదలు ఆంతర్యం లోని బుద్ధ్యాదుల వరకు సమస్తమును ప్రకాశింప చేసేది స్వప్రకాశ చైతన్య మైన క్షేత్రజ్ఞ స్వరూపమే. చైతన్యాత్మక మైన ఈ క్షేత్రజ్ఞ జ్యోతి చేత ఉద్దీప్తము లైన ఆదిత్యాదులు, అగ్ని తప్తమైన లోహ గోళము వలె వాటి కంటే అన్యమైన విషయాలను ప్రకాశింప చేస్తున్నాయి.

సమస్తాన్ని ఈ విధంగా ప్రకాశింప చేసే క్షేత్రజ్ఞ ప్రకాశము తన ప్రకాశానికి మరొక దానిపై ఆధార పడనిది కావడం చేత, అది ఆదిత్య వర్ణమని, అజ్ఞాన మనే చీకటికి దూరస్థ మైనదని వేదం కీర్తించింది (**ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్**). తెలిసేది వెలుగు. తెలియనిది చీకటి. చీకటి వెలుగులు రెండిటిని ప్రకాశింప చేసే సాక్షీ ప్రదీపము చైతన్య జ్యోతి. జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని రెండిటిని ప్రకాశింప చేసే సర్వ సాక్షి క్షేత్రజ్ఞుడే.

### హృదయాలయం

జ్ఞేయ మేదో అది జ్ఞానం లోనే ఉంది. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. **జ్ఞానస్య అభ్యన్తరే జ్ఞేయం మాధుర్యం పయసో యథా** - పాలలో తియ్యదనం లాగా జ్ఞానం లోనే జ్ఞేయం ఉంది అని శాస్త్ర వాక్యము. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యము - అంతా అఖండమే. అద్వయమే. అలాంటి దానిని ఎక్కడ పొందాలి? ఎప్పుడు పొందాలి? దాని ఉపలబ్ధి స్థానం ఏది? అది గ్రామాంతరం లాగా దేశము చేత వ్యవహితమై ఉందా? వేరు చేయబడి ఉందా? లేక, బాల్యాది అవస్థల లాగా కాలం చేత వ్యవహితమై ఉందా? లేదు. అది ఎప్పుడూ ఉంది, కనుక ఇప్పుడే ఉంది. అది అంతటా ఉంది కనుక ఇక్కడే ఉంది. బుద్ధి యందే ఉంది. హృదయ మందే ఉంది (**తత్ హృది బుద్ధౌ సర్వస్య ప్రాణి జాతస్య, విష్ఠితం విశేషేణ స్థితమ్**). సర్వ ప్రాణుల హృదయ మందిరాలలో దర్శింప బడుతూ ఉంది.



## స్పందన

గురుదేవుల పాదపద్మములకు కోటి వందనాలు.

అనంతమైన ఆనందాన్ని అందరూ అనుభవించాలని తపించే మీ హృదయం వర్ణనాతీతం. సమాజంపై మీకున్న ప్రేమ అనిర్వచనీయం. ఈ ఆంధ్రదేశం మీకు ఋణపడి ఉంది అనడంలో అతిశయోక్తి లేదు.

ఇవి పొగడ్తలు కావు. మీరు సమాజానికి అందిస్తున్న సేవలు అలాంటివి. ఎన్ని జన్మల పుణ్య ఫలమో మీరున్న కాలంలో మేము జీవిస్తున్నాం. మీ ప్రవచనాలు వింటూ ఉంటే, మీ రచనలు చదువుతూ ఉంటే, సంశయాలన్నీ పటాపంచ లవుతుంటాయి. సత్యం తెలుస్తూ ఉంటుంది. మీ కారణంగా పరమానందాన్ని అనుభవిస్తున్నాం. తరిస్తున్నాం.

నేను విద్యార్థిని. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. పరీక్షలు దగ్గరి కొచ్చేశాయి. మరో ప్రక్క, ఎంతో కాలంగా కళ్ళల్లో వత్తు లేసుకొని నిరీక్షిస్తున్న 'చైతన్య భగవద్గీత' ఆవిష్కరణ మహోత్సవం తేది ప్రకటించ బడింది. ఏమి చెయ్యాలో అర్థం కాక సతమత మయ్యాను. ఏది ముఖ్యం? అని ఆలోచించాను. ఆవిష్కరణ మహోత్సవాన్ని తిలకించడమే ముఖ్యం అనిపించింది. అంతే. ఆశ్రమానికి చేరి పోయాను. అపూర్వమైన ఆనందాన్ని అనుభవించాను. ఒకవేళ రాకపోతే, ఎంత పోగొట్టుకొనే వాణ్ణో అనిపించింది.

ముఖ్యంగా ఆవిష్కరణ సభలో అందనివాడు చైతన్య భగవద్గీతను అందించిన తీరు అద్భుతం. అత్యద్భుతం. దీపాలు ఆరి పోయాయి. ఈ చీకటిలో ఎవరు వస్తారు? ఎవరు ఆవిష్కరిస్తారు? అని అందరూ ఉత్కంఠతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న వేళ చీకటిలో అవతరించిన నల్లనయ్యే చీకటిని అంతరింప చేసేందుకు 'చైతన్య భగవద్గీత'ను స్వయంగా అందిస్తాడని ఎవ్వరూ ఊహించ లేదు. ఆ సన్నివేశాన్ని తిలకించి పులకించి పోయాము.

సీతారామ కళ్యాణ మహోత్సవ సమయంలో మీరు ఆలపించిన కీర్తనలు, 62 ఏళ్ళ వయస్సులో కూడా అలుపు లేకుండా సుమారు పద్నాలుగు పాటలు వరుసగా పాడ గలగడం, రోజుకు పదిహేను గంటలు శ్రమించి, దేహాన్ని, దేహారోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా, రెండు వేల పుటలు భగవద్గీత గ్రంథాన్ని వ్రాయ గలగడం ఎందరికి సాధ్యం? ఇంకా ఆ ఆలోచన లోనే పడి ఉన్నా.

మీరు గురువుగా లభించడం మా జన్మజన్మల భాగ్యం. మీరు పాడిన పాటల రూపంలో, ప్రవచించిన మాటల రూపంలో, ముఖ్యంగా, చైతన్య భగవద్గీత రూపంలో మీరు మాతో మా ప్రక్కనే ఉంటారు. ఉన్నారు.

ఏలేటి నరేశ్
ఆర్మూర్

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానందుల వారి పాదపద్మములకు తులశి వెంకట సుబ్బయ్య నమస్కారములు.

పరమ పూజ్యా! టెలివిజన్లలో ప్రవచనముల ద్వారా, తమరు విడుదల చేస్తున్న సి.డి.ల ద్వారా మానవాళి హృదయాలకు సత్యము అందుతూ ఉండటం పాతిక సంవత్సరాలుగా మా అనుభవంలో ఉంది. తమరు వ్రాసిన చైతన్య భాగవతం, చైతన్య రామాయణం, చైతన్య భారతం చదివి ఆనందించాము.

చైతన్య భగవద్గీత కూడా మాకు అందింది. **'గిరిధారి'**లో మీరు వ్రాసే ఆప్తవాక్యం తమ దివ్య హృదయాన్నే మాకు పంపుతున్నట్లు వ్రాస్తారు. అది చదివి మా హృదయాలు అనిర్వచనీయ మైన ఒక స్థితికి చేరుతాయి. తమ యొక్క శారీరక వయస్సు పెరిగినా, అలసట ఎరుగని ప్రవచనాలు, రచనలు, **'గిరిధారి'** వ్యాసంగము తమకు నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాయి.

మేము మా గ్రామం లోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానములో గత 18 సంవత్సరాలుగా ప్రతి రోజు సాయంత్రం భగవద్గీతను వివరించుకుంటూ సత్సాంగత్యమును సాగిస్తున్నాము. మా ప్రసంగాలలో ప్రతి రోజు ఒక్కసారైనా తమ నామం, తమ గ్రంథ విశేషములు వస్తూనే ఉంటాయి. 'ఉపదేశసారం' పై తమరు చేసిన దివ్య ఉపన్యాసములు అన్నిటి కన్నా నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

సదా తమ దివ్య ఆశీస్సులు ఆశిస్తూ,

విధేయుడు,
**తులశి వెంకట సుబ్బయ్య**
**పోరుమామిళ్ళ, కడప జిల్లా**

## సంతాపము



**శ్రీమతి ఎమ్.చిన్నాలు**
**సుందర సత్సంగ్**
**విశాఖపట్టణం**



**శ్రీమతి సి.సరోజిని దేవి**
**హైదరాబాద్**



# ఓ కథ చెప్పనా!

**స్వామి సుందర చైతన్యానంద**

## సత్యకామ జాబాలి

సత్యకాముని తల్లి జాబాలి. ఒకనాడు సత్యకాముడు తల్లిని సమీపించి, 'అమ్మా! నేను బ్రహ్మచారిని కావా లనుకుంటున్నాను. అమ్మా! నా కుల మేమిటి? గోత్ర మేమిటి?' అని అడిగాడు.



'నాయనా! సత్యకామా! ఆ విషయం నాకే తెలియదు. నేను యౌవనములో దాసీవృత్తిలో జీవించాను. అనేక చోట్ల తిరిగాను. ఆ సమయం లోనే నిన్ను ప్రసవించాను. నీ కుల మేదో నా కెలా తెలుస్తుంది నాయనా! నీ పేరు సత్యకాముడు కదా! నా పేరు జాబాలి. కనుక, నీవు సత్యకామ జాబాలి వని చెప్పుకో!' అన్నది తల్లి. తల్లి చెప్పినట్లే, గురుదేవు డైన గౌతమ మహర్షికి సత్యకాముడు విన్నవించి, తనకు బ్రహ్మవిద్యను ఉపదేశించ మని అర్థించాడు. ప్రార్థించాడు.

ఉపనయనము లేనివాడు బ్రహ్మవిద్యకు అధికారి ఎలా అవుతాడు? అందుచేత, ముందుగా గౌతముడు సత్యకామునకు ఉపనయన సంస్కారము చేసి, ఆ తరువాత బ్రహ్మవిద్యోపదేశం చేశాడు.

సత్యకాముడు శూద్రుడే కదా! మరి, గౌతమ మహర్షి అతనికి ఉపనయన సంస్కారము ఎలా చేశాడు? పైగా బ్రహ్మవిద్యను ఉపదేశించాడు కూడా. ఇదేమి కాకమ్మ కథ కాదు. ఉపనిషత్తు. మహత్తర మైన ఛాందోగ్య శ్రుతి.

శూద్రుడు, జాబాలి కుమారుడైన సత్యకామునిలో అనర్హత లేదని నిర్ణయించిన తరువాతే గౌతమ మహర్షి ఉపనయన సంస్కారాన్ని చేయుటకు సిద్ధ పడ్డాడు.

'దోషము లేదని నిర్ణయించిన తరువాతే గౌతముడు సత్యకామునికి ఉపనయనం చేయించాడు' అన్నది బ్రహ్మసూత్రము.

తల్లి యొక్క చరిత్రను దాచుకోకుండా ఉన్నదున్నట్లు సత్యకాముడు గౌతమునికి చెప్పాడు. సత్యం పలికిన కారణంగా సత్యకాముని అధికారిగా గుర్తించాడు గౌతమ మహర్షి. అంతేగాని, జన్మను చూచి నిరాకరించ లేదు. ప్రస్థానత్రయంలో ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు మరియు భగవద్గీత, బ్రహ్మ జ్ఞానాన్ని పొందడానికి శూద్రులకు అనర్హతను ఎక్కడా సూచించలేదు.

'పుట్టుక లేనిది, వినాశము ఎరుగనిది, సమమైనది అయిన బ్రహ్మ విషయము నందు సునిశ్చిత మైన శ్రద్ధ కలవారు స్త్రీలు కనుక బ్రహ్మ విద్యార్జన చేసి పరమార్థమును పొందుతారు' అని శ్రీ శంకరాచార్య స్వామి కూడా వ్యాఖ్యానించారు.

# మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-3

స్వామి సుందర చైతన్యానంద

## బౌద్ధ ధర్మ దీక్షలో కుమారిలుడు

బౌద్ధ దర్శనమును చక్కగా అధ్యయనం చేయాలని కుమారిలుడు సంకల్పించాడు. బౌద్ధభిక్షువై బౌద్ధాచార్యుని వద్ద కొన్ని రోజులుండి బౌద్ధ దర్శనమును అధ్యయనం చేశాడు. ఈ విషయమును శ్రీ శంకరులతో భాషించునపుడు కుమారిలుడే స్వయంగా అంగీకరించాడు.



***అవాదిషం వేద విఘాత దక్షైః తాన్నాశకం జేతు మబుధ్యమానః।***
***తదీయ సిద్ధాన్త రహస్య వార్ధీన్ నిషేధ్య బోద్ధాద్ధి నిషేధ్య బాధః॥***

'విద్వాంసుడా! ఏ శాస్త్రమునైనను దాని రహస్యములను గ్రహించకుండా విమర్శించకూడదు. నేను బౌద్ధ ధర్మమును చీల్చి చెండాడవలెనని భావించాను. దానిని ఖండించుటకు ముందు చక్కగా బౌద్ధ ధర్మమును గ్రహించాలని సంకల్పించాను. వినమ్రుడనై బౌద్ధులను శరణు జొచ్చాను. వారి ధర్మాలను పఠించాను' అని కుమారిలుడు శ్రీ శంకరులతో స్వయంగా చెబుతాడు.

కుమారిలుడు ఏ బౌద్ధాచార్యుని వద్ద ధర్మాధ్యయనము చేశాడో స్పష్టంగా తెలియుట లేదు. కాని, ఆ సమయాన నలందా విశ్వవిద్యాలయమున అధ్యక్షుడుగా ఉండిన ధర్మపాలుడు అనే బౌద్ధాచార్యుని వద్ద అభ్యసించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇది కూడా అనుమానమే కాని ఆధారము కాదు.

ఒకనాడు ధర్మపాలుడు నలందా మహా విహారము లోని విశాల ప్రాంగణమున కూర్చొని అభినివేశముతో బౌద్ధ ధర్మోపన్యాసం చేస్తున్నాడు. మధ్యమధ్యన వేదమును నిందించడం జరిగింది. అది వినగానే వైదిక ధర్మ పక్షపాతియగు కుమారిలుని మనసు కలత చెందింది. కళ్ళు మేఘాలై వర్షించాయి.

ఈ ఘటనను ప్రక్కనే యున్న ఒక బౌద్ధ భిక్షువు గ్రహించాడు. ధర్మపాలుని దృష్టి కుమారిలునిపై పడేలా సైగ చేశాడు. వేదనిందను ఆలకించి బౌద్ధ భిక్షువు అశ్రువులను కార్చడమా?

'నీ నేత్రముల నుండి కన్నీరు ఎందుకు స్రవించు చున్నది? దానికి మేము చేసిన వేదనింద కారణము కాదు గదా?' అని ప్రశ్నించాడు కుమారిలుని ధర్మపాలుడు.

'అదియే కారణము. వేదముల లోని నిగూఢ రహస్యములను గ్రహించకుండా మీరు వేదాలను నిందించారు. నా కన్నీటికి అదియే కారణము' అని నిర్భయంగా చెప్పాడు కుమారిలుడు.

*(34వ పేజీ చూడుము)*



# నిర్ణయాలే బ్రతుకును నిర్దేశిస్తాయి

స్వామి సుందర చైతన్యానంద



జీవితంలో నిర్ణయాల ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలి. గుర్తించాలి. గతంలో సరియైన నిర్ణయాలు తీసుకోలేక గాడి తప్పి నడక సాగించాం. అశాంతి కుటీరంలో మకాం పెట్టాం. నవ్వుల్ని దూరం చేసుకున్నాం. సరియైన నిర్ణయాలు తీసుకోలేక గతంలో బ్రతుకును, బుద్ధిని పాడు చేసుకున్న మనం ఇప్పుడు సరియైన నిర్ణయాలను తీసుకొని బుద్ధిని సరి చేసుకోవాలి. బ్రతుకును సరిదిద్దు కోవాలి. అప్పుడే పోయిన నవ్వులు తిరిగి మన బ్రతుకుల లోకి ప్రవేశిస్తాయి.

నిర్ణయాల విషయంలో ప్రధానంగా రెండు విషయాలను అర్థం చేసుకోవాలి. ఒకటి, మనం తీసుకొనే నిర్ణయం సరియైనదై ఉండాలి. రెండు, నిర్ణయం తీసుకున్న తరువాత ఆచరణలో వెనుకడుగు వేయ కూడదు. ఫలం చేతి కందినంత వరకు దీక్ష అకుంఠితంగా ఉండాలి. ఈ విషయంలో సిద్ధార్థుడు సర్వులకు ఆదర్శము. ఈ ఒక్క విషయంలో బుద్ధుడే నా హృదయంలో ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తాడు. ఆ తరువాత, రెండవ స్థానం స్వామి రామతీర్థది.

## సిద్ధార్థుని కఠోర నిర్ణయం

శుద్ధోధన మహారాజు కుమారుడు సిద్ధార్థుడు. రాజ సింహాసనము తన కొరకు నిరీక్షిస్తూ ఉంది. ఒక వైపు అందమైన అర్ధాంగి, మరో వైపు ముద్దు లొలికే సుపుత్రుడు. అతనికి ఏమి తక్కువ? ఒకనాడు మార్గ మధ్యంలో ఒక రోగిని, ఒక ముదుసలిని, ఒక శవాన్ని, ఒక సన్యాసిని చూచాడు. మనస్సు కల్లోల మైంది. బుద్ధి విచలిత మైంది. హృదయంలో వైరాగ్య జ్వాల ప్రదీప్తమైంది. సత్యాన్వేషణకు సిద్ధపడ్డాడు సిద్ధార్థుడు. గయకు చేరాడు. బోధి వృక్షము క్రింద ఆసీన మయ్యాడు. మెల్లగా కళ్ళు మూసాడు. బుద్ధిలో తనకు తాను కఠోర నిర్ణయం తీసుకున్నాడు.

ఇహాసనే శిష్యతు మే శరీరం త్వగస్థి మాంసం విలయం చ యాతు।
అప్రాప్య బోధిం బహుకల్ప దుర్లభాం నైవాసనాత్ కాయ మతః చలిష్యతే॥

ఇది సిద్ధార్థుని కఠోర నిర్ణయం. ఈ ఆసనం లోనే (ఇహాసనే) నా శరీరము (మే

శరీరం) శుష్కించి పోనీ గాక! (శిష్యతు). నా దేహం లోని చర్మము (త్వక్), ఎముకలు (అస్థి), మాంసము (మాంసం) మట్టిలో కలిసిపోనీ గాక! ధూళిలో ధూళిగా చేరిపోనీ గాక! (విలయం చ యాతు). అనేక యుగాలలో, కల్పాలలో యత్నించినా సాధ్యము కాని (బహుకల్ప దుర్లభాం) జ్ఞానమును లేదా సత్యమును (బోధిం) పొందకుండా (అప్రాప్య), ప్రస్తుతము నేను కూర్చొనియున్న ఈ ఆసనము నుండి (ఆసనాత్) నా దేహము (కాయం) చలించనే చలించదు (న చలిష్యతే). ఆహా! ఏమి నిర్ణయం! ఎంత కఠోరమైన నిర్ణయం! నిర్ణయం తీసుకోవడమే కాదు. దానిని ఆచరించుటలో ఎక్కడా రాజీ పడలేడు. తన నిర్ణయానికి తాను కట్టుబడి పోయాడు. అదే ఆసనంలో పన్నెండు సంవత్సరాలు చలించకుండా ఉండి పోయాడు. ఇక్కడే సిద్ధార్థుడు బుద్ధు డయ్యాడు.

(1) దృఢమైన నిర్ణయం తీసుకో గలగాలి (2) ఆ తరువాత సుదృఢవ్రతుడై నిర్ణయాన్ని మరో ఆలోచన లేకుండా అమలు పెట్ట గలగాలి. అట్టి వారే ఆధ్యాత్మిక మార్గంలో అనుకున్నది సాధించ గలరు. సంతోషంతో, ఆనందంగా నవ్వుతూ జీవించ గలరు.

అందుచేతనే, మన సంప్రదాయంలో ఉపనయన సంస్కారము చేసేటప్పుడు గాయత్రీ మంత్రమును ఉపదేశిస్తారు. ఉపనయనము జరిగే దశ జీవితములో చాలా కీలక మైనది. ఆ దశ నుండే బుద్ధి ఆలోచనలను తీవ్రంగా కదిలిస్తుంది. ఆ దశలో తీసుకొనే నిర్ణయాలు శక్తివంతంగా, పుష్టివంతంగా ఉండాలి. అలాంటి నిర్ణయాలు తీసుకొనే శక్తి బుద్ధికి ఉండాలి. అదే ధీశక్తి. కనుక బుద్ధి ప్రకాశవంతంగా ఉండి, సరియైన నిర్ణయాలు తీసుకొనే విధంగా ఉండేందుకు బుద్ధి వికసనానికి గాయత్రీ మంత్రమును బ్రహ్మచారులు జపించేటట్టు మంత్రదీక్షను పెద్దలు అనుగ్రహించే వారు.

## గాయత్రీ మంత్ర వైభవము

ఓం భూ ర్భువః స్వః త త్సవితు ర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ।
ధియో యో నః ప్రచోదయాత్ ।

ఇది గాయత్రీ మంత్రము. గాయత్రి అనేది మంత్రము యొక్క పేరు. గాయత్రి అనేది ఛందస్సు కూడా. ఈ మంత్రము గాయత్రీ ఛందస్సులో ఉండటము కూడా విశేషము. గాయత్రిని వేదంలో సావిత్రి అని కూడా పిలుస్తారు. ఈ మంత్రమునకు విశ్వామిత్ర మహర్షి మంత్రద్రష్ట.

ఓం భూర్భువః స్వః - ఓంకారము భగవంతుని వాచకము. భగవంతుడు వాచ్యము. ఓంకారము వాచకము. ఇది అభిధేయ అభిధాన సంబంధము. భగవంతుడు అభిధేయము.



ఓంకారము అభిధానము. ఓంకారము అనేది భగవంతుని పేరు (తస్య వాచకః ప్రణవః).

ఈ సమస్త ప్రపంచమూ సర్వేశ్వరుడే. కనుక సమస్తమూ ఓంకారమే. ఓ మిత్యేత దక్షర మిదగ్ం సర్వమ్ - ఈ సమస్త ప్రపంచమూ ఓంకారమే. అలాగే భూర్భువః స్వః - అనేది ఓంకారము యొక్క విస్పష్ట వివరణము. భూలోకము, భువర్లోకము, సువర్లోకము అంతయూ ఓంకారమే. భూః - అంటే భూ లోకము. భువః - అంటే భువర్లోకము, అంటే భూమికి ఊర్ధ్వంగా ఉన్న లోకాలన్నీ భువః క్రిందికి వస్తాయి. అలాగే సువః అంటే అధోలోకాలు. పైన ఏడు లోకాలు, క్రింద ఏడు లోకాలు కలిసి భూర్భువః స్వః - అదే ఓంకారము. అభిధేయమైన బ్రహ్మమునకు అభిధానము.

'భూః' అంటే ఆధారము అని కూడా అర్థము (భూః ఆధారః). 'భువః' అంటే, భూమికి కూడా ఆధారమైన భగవానుడు అని భావము. సర్వ భూతములకు ఆధారమైన భూమి తానే. అంతేకాదు. భూమికి ఆధారమైన వాడు కూడా తానే కనుక భూర్భువః అని భగవానుడు స్తుతింప బడినాడు (భువః అపి భూః). కనుకనే విష్ణుసహస్రనామం జగదీశ్వరుని భూర్భువః అని కీర్తించింది (నామం 942). 'భూర్భువః స్వః' అనేది ఓంకారము యొక్క వివరణమే. అదే పరమాత్మ స్వరూపము. తత్ - ఆ భగవత్స్వరూపము వరేణ్యం. వరేణ్యం అంటే పూజనీయ మైనది. అట్టి ఓంకార స్వరూపుడైన పరమేశ్వరుని మేము ధ్యానించు చున్నాము (ధీమహి). ఆ స్వరూపమే సూర్యుని యందు శోభించు ప్రకాశము. సవితుః అంటే ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడు. సూర్యుడు ఎలాగైతే అంధకారమును నశింప చేస్తాడో అలాగే మనలోని అజ్ఞానమును నశింప చేయువాడు భర్గుడు (భర్గః). భర్జనము చేయువాడు భర్గుడు (శివసహస్రనామం).

కనుక అట్టి భర్గుడు మా బుద్ధులను ప్రకాశింప చేయుగాక! అనేది ప్రార్థన. భర్గో దేవస్య ధీమహి - ధియో యో నః ప్రచోదయాత్ అంటే నః - మా యొక్క, ధియః - బుద్ధులను, ప్రచోదయాత్ - ప్రకాశింప చేయుగాక! (ప్రచోదనం కుర్యాత్)! అంటే, బుద్ధిని సరిచేయు గాక అని అర్థం. బుద్ధి సరిపడితే, ఆలోచనలు దీప్తిమంత మవుతాయి. నిర్ణయాలు దివ్యంగా ఉంటాయి. అందుకే గాయత్రీ మంత్రజపము.

ఈ విధమైన సాధనల ద్వారా మన బుద్ధులు శుద్ధి పడినపుడు భగవంతుడు ఏమిటో, భగవంతునితో మన కుండే సంబంధము ఎలాంటిదో, ఆయన దయ సదా మనపై ఎలా వర్షించి యుందో అవగత మవుతుంది. అప్పుడే భక్తి వృద్ధి చెందుతుంది. బ్రతుకు భగవన్మయమై ఆనంద దాయకంగా ఉంటుంది. అలాంటి స్థితిలో మనకు ఏం మిగుల్తాయి నవ్వులు తప్ప? ఆలోచించండి!

*(30వ పేజీ తరువాయి)*

కుమారిలుని నిజస్వరూపము అందరికీ తెలిసిపోయింది. ధర్మపాలుడు క్రుద్ధుడయ్యాడు. వెంటనే దూరంగా పొమ్మని ఆజ్ఞాపించాడు. కాని, దుష్టులైన బౌద్ధ విద్యార్థులు కొందరు ఒక పథకాన్ని రూపొందించుకున్నారు. కుమారిలుడు వెళ్ళే లోగా అతనికి హాని చేయాలని సంకల్పించారు. నలందా విహారము లోని ఉన్నత శిఖరము నుండి క్రిందికి తోసేశారు. కుమారిలుడు ఏడవ అంతస్తు పైనుండి క్రిందికి పడుతూ ఇలా సంకల్పిస్తాడు.

**పతన్ పతన్ సౌధతలా న్యారోరుహం**
**యది ప్రమాణం శ్రుతయో భవన్తి।**
**జీవేయ మస్మిన్ పతితో సమస్థలే**
**మజ్జీవనే తచ్ఛృతి మాన్యతా గతిః॥**
**యదీతి సందేహ పద ప్రయోగాత్**
**వ్యాజేన శాస్త్ర శ్రవణాచ్చ హేతోః।**
**మమోచ్చ దేశాత్ పతతో వ్యనక్షీత్**
**తదేక చక్షు ర్విధి కల్పనా సా॥**

సౌధతలాని=మేడ పై భాగమును, ఆరోరుహమ్=ఎక్కినాను, పతన్ పతన్=(అక్కడ నుండి) పడుచు పడుచు, యది శ్రుతయః ప్రమాణం భవన్తి=వేదములు ప్రమాణము అయినచో, అస్మిన్=ఈ, సమస్థలే=చదునైన స్థలమున, పతితః=పడిన వాడనై, జీవేయమ్= జీవించెదను, మజ్జీవనే=నేను జీవించుటలో, తత్=ఆ, శ్రుతి మాన్యతా గతిః=శ్రుతి ప్రమాణమే దిక్కు, 'యది' ఇతి=అయినచో (యది) అను, సందేహ పద ప్రయోగాత్= సంశయ సూచక పదమును ప్రయోగించుట చేత, వ్యాజేన=మిషతో, శాస్త్ర శ్రవణాచ్చ హేతోః=శాస్త్రమును వినుట చేత, ఉచ్చదేశాత్=ఎత్తైన ప్రదేశము నుండి, పతతః మమ=పడిన నాకు, తదేక చక్షుః=ఒక నేత్రము, వ్యనక్షీత్=నష్టమైనది, సా విధికల్పనా=అది దైవ నిర్ణయము.

**భావము :** మేడ పై భాగము నుండి క్రిందికి పడుచు, 'వేదములే కనుక ప్రమాణములైనచో, నేను ఈ సమ స్థలమున పడినను బ్రతుకుతాను. శ్రుతిమాతయే నాకు దిక్కు. వేదములు ప్రమాణములు అయినచో (యది) అని సంశయ సూచకంగా పలుకుట చేత, మిషతో శాస్త్రాధ్యయనము చేయుట చేత ఎత్తైన ప్రదేశము నుండి క్రింద పడిన నాకు ఒక కన్ను పోయింది. ఇది దైవ నిర్ణయము', అని సంకల్పించాడు. ఎత్తైన ప్రదేశము నుండి క్రింద పడినా కుమారిలునికి ఒక చిన్న గాయం కూడా కాలేదు. అది చూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. ఇదంతయూ వేదమాత కృపయే అని కుమారిలుడు భావించాడు.


కుమారిలుడు వేద ప్రమాణమును నిర్ణయించి నిర్దేశించాలని సంకల్పించాడు. ధర్మపాలుని సవాలు చేశాడు. శాస్త్రార్థమున ధర్మపాలుడు కుమారిలుని చేతిలో ఓడిపోయాడు. ధర్మపాలుడు తుషాగ్నిలో తన దేహాన్ని దగ్ధం చేసుకున్నాడు. కుమారిలుని విజయ కేతనము రెపరెపలాడింది.

**(సశేషం)**



# ఉన్న దెక్కడ? లేని దేమిటి?

**స్వామి సుందర చైతన్యానంద**



మనస్సు జడం. 'జడము' అంటే మరొక దానిపై ఆధారపడి ప్రకాశించేది అని అర్థము. అలాంటిది వికారం చెందుతూ ఉంటుంది. జడ మైన దేహం ఎలా మార్పు చెందుతూ ఉందో, అలాగే జడ మైన మనస్సు కూడా మార్పు చెందుతూ ఉంది. మనస్సులో ఒకప్పుడు ఈర్ష్య, ఒకప్పుడు ప్రేమ, మరొకప్పుడు క్రోధం, వేరే సమయంలో మోదం, మోదం అని భావించే లోగా ఖేదం. ఇలా మార్పు చెందే మనస్సును ప్రకాశింప చేసేది స్వప్రకాశమైన ఆత్మయే. ఆత్మపై ఆధారపడి ప్రకాశించే మనస్సు ఆత్మను తెలుసుకోలేదు.

తన కార్యకలాపాలను సాగించుటకు మనస్సు చైతన్యముపై ఆధారపడి ఉంది. కాని, స్వప్రకాశమైన చైతన్యమునకు మరొక దాని అపేక్ష ఉండదు. **(జడం హి స్వకార్యార్థం చేతనం అపేక్షతే, న చేతనస్య పరాకాంక్షా).**

మనస్సు ఆలోచిస్తుంది. ఆలోచించే మనస్సుకు చైతన్యం ఆధారంగా ఉంది. చైతన్యం ఉంటేనే మనస్సు ఆలోచిస్తుంది. మనస్సు లేకపోయినా చైతన్యం ఉంటుంది. ఉదాహరణకు గాఢ నిద్ర. మనస్సు ఆత్మను తెలుసుకోలేదు. ఎందుకని? మనస్సు యొక్క ఉనికికి, ఊడిగమునకు ఆత్మయే ఆధారమై ఉన్నందున, ఆధేయమైన మనస్సు ఆధారమైన ఆత్మను తెలుసుకోలేదు.

వాస్తవానికి ద్రష్ట ఆత్మయే. ఇంద్రియ మనస్సులు కరణములు మాత్రమే. సర్వమును స్వయంగా దర్శించే ద్రష్ట యైన ఆత్మను ఎవ్వరూ దర్శించలేరు **(యం న పశ్యతి కశ్చన).** ఆత్మను దర్శించుటకు నేత్రములు, వాక్కు మనస్సులకు శక్తి చాలదు. **(న తత్ర చక్షు ర్గచ్ఛతి, న వాక్ గచ్ఛతి నో మనః - కేనోపనిషత్).** కనుక ఆత్మను గ్రహించేందుకు మనస్సు, వాక్కు ప్రమాణం కావు. ఆత్మ తెలియాలి అంటే ఆత్మకు సంబంధించిన జ్ఞానం కలగాలి. జ్ఞానము కలగా లంటే ప్రమాణ ముండాలి **(ప్రమాకరణం ప్రమాణం).**

కాని, ఆత్మ ప్రమాణ సిద్ధం కాదు. అంటే, ప్రమాణాలకు అందేది కాదు అని అర్థము. ప్రమాణానికి అందినది అంటే ఆత్మ ప్రమాణానికి విషయ మైంది అని అర్థము. విషయ మైనది దృశ్య మవుతుంది. దృశ్య మైనది జడ మవుతుంది. ఇదొక పెద్ద గందరగోళం.

ఆత్మ దృశ్యమై, జడమై, ప్రమాణానికి అందితే ఆత్మ 'విషయ' మై ప్రమాణం 'విషయి' **(ద్రష్ట)** అవుతుంది. అప్పుడు ప్రమాణాన్ని ఫలింప చేసిందెవరు? ప్రమాణం ఆత్మను

సృష్టిస్తుందా, లేక ఆత్మ వైన నీవు ఉంటే ప్రమాణం ఫలిస్తుందా? కనుక ఆత్మ స్వతః సిద్ధమే గాని ప్రమాణ సిద్ధం కాదు.

ఆత్మ జ్ఞానరూపమై ఉంది. ఆత్మజ్ఞానానికి మరొక జ్ఞానం అవసరం లేదు. **(ఆత్మ జ్ఞానంతు విజ్ఞాన అనపేక్షం, కస్మాత్? విజ్ఞాన స్వరూపత్వాత్).** ఇంద్రియ మనస్సులు పరిమిత మైనవి కనుక ప్రత్యక్ష ప్రమాణానికి అనంతమైన ఆత్మ అందదు. తోకను చూచి ఎలుక అని గ్రహించినట్లు, పొగను చూచి అగ్ని అని తెలుసుకున్నట్లు, పూర్వానుభవమును, స్మృతులను ఆధారం చేసుకొని అనుమాన ప్రమాణం ద్వారా నిర్ణయించుటకు ఆత్మ స్మృతులకు సంబంధించినది కాదు. స్మృతులు మనస్సు లోనివే. కనుక అవీ జడములే.

జడములై, వికారము చెందే వన్నీ ఒక దశలో నిషేధింపబడి బాధితా లవుతున్నాయి. ఆత్మ నిషేధింప బడేది కాదు. ఒకవేళ ఆత్మ నిషేధింప బడేదే అయితే, అలా బాధితమైన ఆత్మను తెలుసుకొనే దెవరు? పోనీ, అది అయినా ఆత్మ కావాలి కదా? నిషేధింపబడే వాటిని తెలుసుకొంటూ అన్నీ నిషేధింపబడిన తరువాత, నిషేధింపబడక అబాధితమై ఏది సాక్షి స్వరూపంగా భాసిస్తూ ఉందో అదే ఆత్మ **(నిషేధావధీ సాక్షీ).**

అట్టి సాక్షీ చైతన్యమును మనస్సు, వాక్కు గ్రహింపగలవా? **(మనసా వచసాం అగమ్యం)** గ్రహించలేవు. 'గ్రహించలేవు' అనే మాట పలకడానికి కూడా చైతన్యమే ఆధారము. వాక్కులకు అంతుపట్టని ఆత్మ యొక్క అనుగ్రహము వలననే వాక్కులు కదులుతున్నాయి **(వాచో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ).**

**ఇది కాదు - ఇది కాదు**

**నేతి - నేతి** (ఇది కాదు - ఇది కాదు) అనెడి వాక్యముల ద్వారా వేదము ఆత్మను నిర్దేశించుచున్నది. "ఇది కాదు" అనే వాక్యములో 'ఇది' - 'కాదు' అనే రెండు పదము లున్నాయి. 'ఇది' అన్నప్పుడు, ఏదో ఉన్నది కనుకనే 'ఇది' అనవలసి వచ్చింది. కనుక 'ఇది' అనేది ఉన్నది అని అర్థం. 'కాదు' అంటే, లేనిది అని ఎలా చెప్పగలం? కనుక 'ఇది' అంటే ఉన్నది అని నిర్ణయించాం కాబట్టి "ఇది కాదు" అంటే 'ఇది ఉన్నది కాదు' అని అర్థము.

"ఇది కాదు" (నేతి) అనే వాక్యములో 'ఇది ఇది కాదు' అనేది దాని అర్థం కాదు. 'ఇది అది కాదు' అనేది కూడా కాదు. 'ఇది లేదు' అనే అర్థం అసలే కాదు. "ఇది కాదు" అంటే "అది ఇది కాదు" అని భావం. 'ఇది' అదే అయినా, 'అది' ఇది కాదు అని గ్రహించడమే వివేకము. ఈ వివేకము చేత మాటలకు, వాక్కుకు అందని ఆత్మను గ్రహింప వీలవుతుంది **(వివేకతః బోద్ధుం శక్యం ఇతి).**


మట్టి కుండ, మట్టి ముంత, మట్టి మూకుడు - వీటి విషయంలో "ఇది కాదు - ఇది కాదు" అంటే, 'మట్టి కుండ మట్టి కుండ కాదు' అనేది అర్థం కాదు. 'మట్టి కుండ మట్టి కాదు' అనేదీ కాదు. 'మట్టి కుండ లేదు' అనేదీ కాదు. "ఇది కాదు" అంటే 'మట్టి, కుండ కాదు' అని భావం. కుండ మట్టే అయినా మట్టి కుండ కాదని గ్రహించటమే వివేకము. మట్టిని కుండ అంటే ముంత విషయ మేమిటి? మూకుడు విషయ మేమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి.

***(42వ పేజీ చూడుము)***



# మనస్సు - మహిమ

**స్వామి సుందర చైతన్యానంద**



"నీకు మెదడు ఉందా?" అని ఒకడు మరొకణ్ణి ఈ ప్రపంచంలో ప్రశ్నిస్తున్నాడే గాని, కేవలం మెదడు ఉండి మాత్రం ఏం లాభం? అని తనను తాను ప్రశ్నించుకోలేక పోతున్నాడు.

బ్యాంక్ లాకర్ ఉంది. కాని, ఖాళీగా ఉంది. దాని వలన ఏమి ప్రయోజనం? లాకర్‌లో విలువైన సంపద ఉంది. కాని, తాళంచెవి లేదు. చెవి ఉంది; కాని తీసే అర్హత లేదు. ఇవన్నీ ఏమి ప్రయోజనం? మెదడు ఇలాగే ఉంది. మెదడు మనిషికి ఉంది; గొఱ్ఱెకి కూడా ఉంది. కాని మనస్సు మనిషి కుందే గాని గొఱ్ఱెకు లేదు. ఇప్పు డర్థమయిందా? మనస్సు పనిచేసేందుకు మెదడు అవసరమేమో గాని, మెదడే మనస్సు కాదు.

మెదడు దాచుకొనేందుకే పనికొస్తుంది. మనస్సు సంపాదిస్తుంది. అలాగే ఖర్చు పెడుతుంది కూడా. నాడుల కూడలి మెదడు. ఇప్పటి వరకు అందినదంతా దానిలోనే ఉంది. అందిన వాటిని మెదడు ఉంచుకోవచ్చు. లేదా పారేసుకోవచ్చు. అందని వాటిని పట్టుకోవడం, తెచ్చుకోవడం మెదడుకి చేతకాదు. అది మనస్సుకే సాధ్యం.

కంప్యూటర్‌ని మెదడు కనిపెట్టలేదు. మనస్సు కనిపెట్టింది. కంప్యూటర్‌లో ఉన్నదంతా మెదడే గాని మనస్సు కాదు. మనిషి మనస్సు కంప్యూటర్‌కి చిక్కితే ఆ తరువాత కమాండ్స్ ఇచ్చేది మనిషి కాదు. కంప్యూటరే.

మనం దాచిందంతా(ఇన్‌పుట్) కంప్యూటర్‌లో ఉంటుంది. ప్రక్రియ (ప్రోసెస్) అంతా అందులోనే నడుస్తుంది. అప్పుడే ఫలితం (ఔట్‌పుట్) వస్తుంది. అయితే ఈ ప్రక్రియ నంతా మనిషే నడపాలి. అంటే మనిషి మనసే నడపాలి. ఇక్కడే మనస్సుది పైచేయి అయింది.

కంప్యూటర్‌లో విషయం నిక్షిప్తమై ఉన్నట్లు మెదడులో చాలా విషయాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఈ ప్రోగ్రాం అంతా మనసే చేసింది. ఏమున్నాయి మెదడులో? అభిప్రాయాలు, అనుభవాలు, సిద్ధాంతాలు, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, అలవాట్లు - ఇలా ఎన్నో గతంలో తయారు చేసుకున్నవి మెదడులో దాగి ఉన్నాయి. ఇలా దాచింది ఎవరో కాదు; మనస్సే.

కంప్యూటర్‌లో విషయా లున్నాయి. మనస్సు లేదు. మెదడులో కూడా విషయా లున్నాయి. అంతేకాదు; మనస్సు కూడా ఉంది. ఇక్కడే కొద్ది లోతుగా ఆలోచించాలి.

కంప్యూటర్‌లో ఏది దాచామో అదే వస్తుంది. కాని మెదడులో లేని దానిని కూడా మనస్సు ద్వారా వ్యక్తం చేయవచ్చు. కాకరకాయ నాకు ఇష్టం లేదు. ఈ విషయం మెదడులో ఉంది. వస్తుగుణం తెలిసి దానిని మనిషి మనస్సు ద్వారా వాంఛించి పొందవచ్చు. ఇక్కడ మెదడు నిరాకరించి సాధించే దుండదు. ఈ విధమైన మార్పుకి మెదడులో అవకాశముంది.

మెదడు కూడా కంప్యూటర్ లాగా దాచిన వాటినే ప్రదర్శించటానికి అలవాటు పడి, మార్పుకు అవకాశ మివ్వకపోతే, కంప్యూటర్‌లో లేని మనస్సు మెదడులో ఉండి ప్రయోజన మేమిటి? కంప్యూటర్‌లో వైభవముంది. మనస్సులో వైభవంతో పాటు వ్యక్తి దాగి యున్నాడు. ఇదే అర్థం కావాలి.

దాచినవి గాక వేరే వాటిని కంప్యూటర్ వ్యక్తం చేయలేదు. కాని మనలో అది వ్యక్తం కావాలి. అప్పుడే కంప్యూటర్ కన్నా మన ద్వారా ఎక్కువ మేలు జరుగుతుంది. దాని కన్నా మనమే ఆకర్షణా కేంద్రా లవుతాము.

**ఇంతకీ, నేను చెప్పొచ్చిం దేమిటంటే,**

మన మెదడులో నిలువ యున్న విషయాలకి అనుగుణంగా మనమూ ప్రవర్తిస్తే మనమూ కంప్యూటరే అవుతాము. దాని లాగే మనమూ అమ్ముడు పోతాము. వైరస్‌కి కూడా గురి అవుతాము. కంప్యూటర్‌ది వాడుకలో వేడుక. నీది వేడుకలో వాడుక.

మన అభిరుచులకు, అవసరాలకు, అలవాట్లకు అనుగుణంగా ఆలోచించడం మనకు తెలుసు. ఇది కంప్యూటర్ విధానం. ఈ పని చేయడానికి మెదడు సరిపోవచ్చు. బుద్ధి అవసర మేమిటి? ఇతరుల అవసరాలను, అభిరుచులను, ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని ఆ మార్గంలో కూడా మన ఆలోచనల్ని కదిపి నపుడే బుద్ధి ఉన్నందుకు సార్థకత.

నేను ఆలోచించినట్లు ఇతరులు ఆలోచించాలి అని కాకుండా ఇతరుల దృక్కోణం నుండి కూడా నా ఆలోచనల్ని కదిపే ప్రయత్నం నేను సాగించాలి. ఇతరుల స్పందనలకు నా స్పందన తోడై ఆలోచించాలి. ఇతరుల అవసరాలలో నా ఆసక్తి ఇమిడిపోవాలి. అప్పుడు తాత్కాలికంగా మనం మరొకరిలో చేరి పోతాము. తద్వారా మనవల్ల ఇతరులు ఇబ్బందికి గురికారు. పైగా మన సిబ్బందిగా మిగులుతారు. మనకు కూడా ఎంతో తృప్తి ఉంటుంది.

ఒక్క సత్యాన్ని కష్టపడి అయినా అర్థం చేసుకోవాలి. ఇతరుల ఆలోచనలతో కలిసి కొంతసేపు ఆలోచించడానికి మించిన సేవ ఈ ప్రపంచంలో మరొకటి లేదు. దీనిని అంగీకరించటానికి అనుభవ మొక్కటే సరిపోదు. సౌజన్యంతో కూడిన జీవితం కావాలి.

అదొక్కటి లేని కారణంగా ఇంతవరకు మానవ సమాజంలో ఎంతో మారణహోమం, దారుణపాపం జరిగిపోయింది. ఎందరు దంపతులు విడిపోయారో! అన్నదమ్ము లెందరు విడిపోయారో! ఎందరి స్నేహం బుగ్గిపాలైందో! ఎందరి రక్తం ఏరులై పారిందో! ఎన్ని దగాలో! ఎన్ని మోసాలో! ఎన్ని మాయలో! ఎన్ని ద్రోహాలో! -



ఇవన్నీ దేని ఫలితం? ఒకరి ఆలోచనలతో కలిసి మరొకరు ఆలోచించలేని దౌర్బల్యం యొక్క ఫలితం. పాప ఫలితం.

మనం కంప్యూటర్ కాదు. మెదడు కాదు. మనస్సున్న మనుష్యులం. పదిమందితో కలిసి జీవిస్తున్న మనుష్యులం. సభ్య సమాజంలో తిరుగుతున్న వాళ్ళం. వాళ్ళని కష్టాల్లో, కన్నీటిలో ముంచి మనం సుఖాల్లో, పన్నీటిలో తేలి ఆడలేము.

**అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః**

"సర్వభూతముల యందు ద్వేషము లేనివాడు, మిత్రత్వము కలిగినవాడు భక్తుడు" అన్నాడు గీతలో భగవానుడు.

అనడమే కాదు. చేసి చూపాడు. ఆదర్శంగా శోభించాడు. పాండవులు, విదురుడు, ద్రౌపది, కుచేలుడు - వీరందరూ బాధల్లో ఉన్నవారే. బాధా పూరితమైన ఆలోచనల్ని కదిలించినవారే. శ్రీకృష్ణుడు వాళ్ళ ఆలోచనలతో కలిసి ఆలోచించాడు. ఆ విధంగా వారిని ఆపదల నుండి కాపాడాడు.

ఎవరి ఆలోచనలతో దుర్యోధనుడు శ్రుతి కలిపాడు? ఒక్క క్షణం ఆలోచించండి. భీష్మద్రోణాదుల పవిత్ర సంకల్పాలతో విభేదించాడు. కన్న తల్లిదండ్రుల ఆలోచనలతో కూడా ఏనాడూ ఏకం కాలేదు. ఫలితం? తానొక్కడే ఏకాకిగా మిగిలిపోయాడు. అపకీర్తితో రాలిపోయాడు.

ఇతరుల ఆలోచనలకు మనము తల ఒగ్గాలి అనేది నా అభిమతం కాదు. ఒకరి భావాలకు మనం బానిసలం కానవసరం లేదు. కాకూడదు కూడా. కాని, ఇతరులతో కలిసి జీవించే టప్పుడు వారి ఆలోచన లెలా ఉన్నవో కొంతకాలం కలిసి నడిస్తే గాని అర్థం కాదు. ఈ విధమైన ఆలోచనా విధానం వల్ల ఇతరులకు మన వల్ల అన్యాయం జరుగదు. కనుక మనకు పాపం అంటదు.

అంతేగాదు. అలా ఆలోచించటము వలన ఇతరుల యదార్థస్థితి మనకు తెలుస్తుంది. తద్వారా మన ప్రవర్తన ఋజుమార్గంలో పయనిస్తుంది. వారికి మన ద్వారా మంచి జరుగవచ్చు. ఈ కారణంగా మనకు పుణ్యం ప్రాప్తిస్తుంది.

ఇవన్నీ ఎలా ఉన్నా, నాతో కలిసి ఆలోచించే మిత్రుడు నాకు లభించాడు అని ఒక్కరు మన వలన తృప్తి చెందగలిగినా మన జన్మ ధన్యమైనట్లే. ఇదే అత్యుత్తమ సేవ యని నా అభిప్రాయము. అగ్రశ్రేణి సేవ యని నా ప్రగాఢ విశ్వాసము. మీరూ ఆలోచించండి.

**లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు**




ఆత్మ బంధువులారా,
ఓం నమో భగవతే వాసుదేవాయ.

మన మనుగడ ఏమిటి? మన ఉనికి ఎందుకు? మనకున్న దేమిటి? మనం పొందాలనుకుంటున్న దేమిటి? దేని కొరకు? - ఈ విషయాలలో ఘర్షణ ఉన్నంతవరకు మనం సుఖపడలేము. ఇదే అశాంతి. ఘర్షణ నుండి విడిపడితే అదే శాంతి. అదే మోక్షం.

ఇది తెలుసుకోవలసింది. తెలియటమే జరుగనపుడు ఇక పొందే దేముంటుంది? కనుక బ్రహ్మమును లేదా సత్యమును తెలుసుకోవాలి. బ్రహ్మమును తెలుసుకొనేవాడు బ్రహ్మమే అగుచున్నాడు.

**బ్రహ్మవి దాప్నోతి పరమ్**

అన్నది తైత్తిరీయ ఉపనిషత్తు.

పుణ్యాత్ముని పాడు చేయటం ఎవరికీ సాధ్యం కాదు. పాపిని పాడు చేయటానికి మరొకరి అవసరం ఉండనే ఉండదు. వాడి పాపమే వాణ్ణి పాడు చేస్తుంది. పాపి గంతులేస్తూ పాపం చేస్తాడే గాని, అది తన గుంటను తాను త్రవ్వుకోవటమే నని పాపికి తెలియదు.

మంచిని వంచించే వారు లేరు. చెడును అందరూ బాగు చేయలేరు. పుణ్యాత్ముల బాట పూలబాట. అహంకారులది ఎప్పుడైనా, ఎక్కడైనా ముళ్ళబాటే.

వరాలిచ్చిన వామదేవుని అంతం చేయాలని చూశాడు భస్మాసురుడు. అదీ వాడి పాపం. పాపపు ప్రారబ్ధం గల వారి చేష్టల్ని చూసినపుడు వీళ్ళిలా ఎందుకు చేశారు? అని కాదు ఆలోచించవలసింది. ఇంతకన్నా మరోవిధంగా ఏమి చేయగలరు? అని.

"అమ్మా! ఉమా! ఏమిటి నీ ఉన్మాదం? శివుణ్ణి ప్రేమించావా? పరిణయ మాడుతావా? నీకు మరొకరు కనిపించలేదా? అతణ్ణి కట్టుకొని నీవేమి సుఖపడతావు? అతడు అజుడు. పుట్టుకే లేనివాడు?" అని పార్వతికి చెప్పి విశ్వకళ్యాణం కొరకు జరిగే పార్వతీ కళ్యాణాన్ని పాడు చేయాలని చూశారు కొందరు పాపులు.

పార్వతి వారిని చూచి, "అలాగా! అతడు అజుడా! పుట్టుకే లేనివాడా? అయ్యో! నాకు తెలియదే! అయితే అతడే నాకు కావాలి. మీరు ఉన్మాద మనుకున్నా ఫరవాలేదు, నా బ్రతుకు అతనితోనే ఊరేగాలి".

"ఈ ప్రపంచంలో నేను చాలా ఊరేగింపులు చూశాను. ప్రభువులు, కవులు,



గాయకులు, నటులు, విద్వాంసులు, నాట్యాచార్యులు - ఇలా ఎందరో ఊరేగటం చూశాను".

"ఒకనాడు పసిడిరథా న్నెక్కి ఊరేగినవారు, మరొకనాడు పాడెపై పోతూ ఉండటం చూశాను. శివుడు పుట్టుకలేనివాడు అనే అందమైన సత్యాన్ని మీరు నాకు తెలిపారు".

పుట్టుక గలది మరణిస్తుంది. శివుడు పుట్టుకలేనివాడు కనుక మరణించడు. నేను ఎప్పటికీ సుమంగళినే. కనుక నాకు శివుడే కావాలి" అంటుంది పార్వతీదేవి. సంస్కారాన్ని, పుణ్యాన్ని ప్రోగుచేసుకొనే పద్ధతిని మనకు ఈ సందర్భంలో పార్వతమ్మ నేర్పుతుంది. పుణ్యం లేకపోతే శుభసంకల్పాలు కలగవు. శుభేచ్ఛ కదలదు.

పుణ్యం యొక్క అవసర మేమిటి? అసలు పుణ్యము, పుణ్యఫలము అనేది ఉందా? పుణ్యం లేకపోతే, తాను ఆశించినపుడల్లా మనిషి సుఖపడవచ్చు. అంతేకాదు. ఎన్నున్నా కొందరు సుఖపడలేరు. ఎందుకని? ఏదో లేక కాదు; పుణ్యం లేక. పాపం కూడా అంతే. పాపమే కనుక లేకపోతే పిలవకున్నా బాధ లెందుకొస్తాయి? పాపం ఉన్న వ్యక్తి సుఖపడలేడు. పైగా చెడునే చూస్తూ, చెడునే ఆలోచిస్తూ ఉంటాడు.

పుణ్యము వలన సుఖం కలుగుతుంది. మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. అంతేకాదు. పరమాత్మను పొందాలనే శుభేచ్ఛ కలుగుతుంది. ఇదే ముముక్షుత్వం.

బోధవల్లనే ముముక్షుత్వం కలుగుతుందని చెప్పలేము. పూర్వపుణ్య విశేషమే ముముక్షుత్వానికి కారణ మవుతుంది. అందుకనే ఈశ్వరానుగ్రహం ముముక్షుత్వానికి కారణమన్నది శాస్త్రం. ఈశ్వరానుగ్రహం అంటే భగవత్కృప. కృప అనేది ఏదో కాదు. మన కర్మఫలమే. అదే పుణ్యం. భగవత్కృప లేకపోతే ముముక్షుత్వం సులభం కాదు. భగవత్కృప ఉంటే కష్టమూ కాదు.

ముముక్షుత్వం అంటే మోక్షాపేక్ష. మోక్ష మెక్కడుంది? ఎలా ఉంది? మోక్షము వస్తువు కాదు; విషయం కాదు; ప్రదేశము కాదు; కాలమూ కాదు. మోక్షము అనేది జ్ఞానరూపంలో ఉంది. కనుక జ్ఞానాన్ని పొందాలి అనే కోరిక ముముక్షువులలో ఏర్పడాలి. ఇదే జిజ్ఞాస. ముముక్షువు గురువును సమీపిస్తాడు. ముముక్షుత్వాన్ని గురువు జిజ్ఞాసగా మారుస్తాడు. ఇక్కడ ముముక్షువు జిజ్ఞాసువు అవుతాడు.

జ్ఞానాన్ని పొందుతూ ఉంటాడు. కాని, ఇక్కడ కనుక పుణ్యం సరిపోకపోతే, మస్తకాన్ని పుస్తకాలతో నింపేసుకొంటూ ముముక్షుత్వాన్ని జారేసుకుంటాడు; పారేసుకుంటాడు. సాధన చేయడు. ఆలయాలకి వెళ్ళటం న్యూనతగా భావిస్తాడు. పెద్దల్ని నిందిస్తాడు. శాస్త్రాన్ని విమర్శిస్తాడు. దైవదూషణ చేసినా విస్మయం లేదు. పాపం ఏదైనా చేయిస్తుంది. ఇలాంటి దురదృష్టకర సమయాల్లో పుణ్యం తోడుగా నిలుస్తుంది. కనుక ముముక్షువు అయిన జిజ్ఞాసువు కూడా పుణ్యకర్మల్ని, నిత్యసాధనల్ని విస్మరించకూడదు.

దక్షుడికి యజ్ఞభూమి కూడా సహకరించలేదు. అర్జునుడికి యుద్ధభూమి కూడా ఉపకరించింది. పుణ్యఫల విశేషంగా శ్రీకృష్ణుడు లభించాడు. శ్రీకృష్ణుడున్నా అందరికీ ఉపయోగపడలేదు. విదురుడు వినియోగించుకున్నాడు. అర్జునుడు ఉపయోగించుకున్నాడు.

ద్రౌపది లబ్దిని పొందింది. సుధాముడు తరించాడు. వీరందరూ పుణ్యాత్ములు. పాపం! సుయోధనుడు?

కృష్ణుడు ఎవరి సొత్తు? అర్జునునికా? దుర్యోధనునికా? కృష్ణుడు దుర్యోధనునికి దూరం కాలేదు. అతడే దూరం చేసుకున్నాడు. అతని పాపమే శ్రీకారం చుట్టింది. హృదయంలో అహంకారాన్ని దింపి, కళ్ళల్లో కారం పోసుకునేలా చేసింది.

అర్జునుని విడిచి శ్రీకృష్ణుడు ఉండలేకపోయాడు. "నీవు నాకు ఇష్టుడివి. సఖుడివి!", అని మరీ తెగేసి చెప్పుకున్నాడు. అదంతా పార్థుని పుణ్యం.

ప్రపంచం మీద ఆసక్తి ఉన్నంతవరకు పరమేశ్వరునిపై భక్తి ఉదయించదు. మనస్సు తృప్తి చెందిన క్షణాన ప్రపంచంలో ఏదీ అవసర మనిపించదు. తృప్తి చెందని క్షణాన అన్నీ ఉన్నా, వాటితోపాటు ఆవేదన, అసంతృప్తి కూడా ఉంటుంది.

ఎన్ని ఉన్నా, ఎవరు ఉన్నా వెంట వచ్చేది ఏమీ ఉండదనే వివేకం మనిషికి రావడం లేదు. నీడలన్నీ నిజాలుగానే గోచరిస్తున్నాయి.

**బ్రహ్మవి దాప్నోతి పరం**

బ్రహ్మవిదుడు మోక్షాన్ని పొందుతాడు. దానికి గురువు అందించే ప్రమాణమే ప్రధానము. దీనిని అందుకోవటానికి పుణ్యం సదా తోడుగా ఉండాలి. లౌకిక సేవా కార్యక్రమాల ఫలము స్వర్గం. కాని, ఆధ్యాత్మిక సాధనల ఫలం దయ. ఈ రెండవది ఎక్కువగా ఉండాలి.

పరమాత్మ దయతో ఇంకా దయను పెంచుకుంటాం. పెంచుకొనే దయతో మరీ ఎక్కువగా దయను, దయామయుడైన పరమాత్మను మన హృదయంలో ఉంచుకుంటాం.

---

*(36వ పేజీ తరువాయి)*


కుండ యొక్క అస్తిత్వానికి మట్టి ఆధారంగా ఉంది. కుండకు కారణ మైన మట్టి, కుండలో మట్టి గానే ఉంది. కుండ అనేది కేవలం నామరూపాలే. కనుకనే మిథ్య. కుండ మిథ్య. మట్టి సత్యం. కుండ మట్టిపై ఆధారపడి ఉంది. మట్టినే ఆశ్రయించుకొని ఉంది. కుండ మట్టే అయి ఉంది. మట్టి సత్యం కనుక సదా విలక్షణంగా ఉంది.

ఇది వివేకము. సత్యమిథ్యా వివేకము. ఆత్మానాత్మ వివేకము. ఈ విధమైన వివేకము వలన ఆత్మ యందు ఆరోపించబడిన అనాత్మ నిషేధింప బడుతుంది. ఆ తరువాత కేవలము ఆత్మయే పరిశిష్టమై ఉంటుంది. ఆ ఆత్మయే బ్రహ్మము. అతడే దేవదేవుడు. పుట్టుక లేని వాడు **(అజం)**, నశింపు ఎరుగనివాడు **(అచ్యుతం)**.





విశ్వశాంతి మహాయాగము









# 🕉 ఓం నమో భగవతే వాసుదేవాయ 🕉







# సుందర విజ్ఞాన గ్రంథాలయం






మహాత్ములు మనకు అందించిన జ్ఞానమును ఈ చానల్ ద్వారా ప్రతి ఒక్కరికి అందించుదాం . మనకు అందిన జ్ఞానాన్ని ఇతరులకు అందించుదాం శ్రీ కృష్ణ భగవానుని కృప కు పాత్రులవుదాం పూజ్య గురుదేవుల ఆశీస్సులు పొందుదాం ఆత్మబంధువులకు ఇదే నా మనవి జై గిరిధారి జైజై గిరిధారి మీ ఆత్మ బంధువు ఎడవల్లి సుదర్శన్ రెడ్డి - సుందర సత్సంగము హైదరాబాద్

## Links

telugudevotionalswaranjali
telugudevotionalswaranjali.blogspot.com

sundaravignanagrandalayam
sundaravignanagrandalayam.blogspot.com

**JAI GIRIDHARI**
@jaigiridhari9054

SCAN THE QR CODE FOR JAI GIRIDHARI YOUTUBE CHANNEL